


RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా నిజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా నిజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:19 TUESDAY,JUNE 16,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :19 మంగళవారం, జూన్ 16, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


# మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు

**కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్‌పై రేవంత్ విమర్శలు**

**ఐఆర్‌ఎఫ్‌సీ రుణం నిలిపేశారన్న వాదన**

**ఎన్‌ఓసీ ఇస్తే చాలన్న సీఎం**

**బీజేపీ, బీఆర్ఎస్‌పై ఘాటు వ్యాఖ్యలు**

**హైదరాబాద్‌పై కేంద్రం వివక్ష చూపుతోందని ఆరోపణ**



ధర్మఘంట :హైదరాబాద్ విస్తరణను అడ్డుకుంటుందని కేందమంత్రి జి. కిషన్ రెడ్డేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెట్రో టేకోవర్ కావాల్సిన ఐఆర్ఎఫ్‌సీ రుణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున అంతా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. కానీ, కిషన్‌రెడ్డి తన సహచర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి కుట్ర పన్నారని ఆరోపించారు. రుణం మంజూర్ కాకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. జపాన్ నుంచి నిధులు కూడా వచ్చాయని రేవంత్ తెలిపారు. కానీ, వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఇవ్వడం మిగతా2లో

**మెట్రో నిధులు రూ.13,600 కోట్లు ఇవ్వండి..**

- హైదరాబాద్ మెట్రో కోసం రూ.13,600 కోట్లు విడుదల చేయాలని కేంద్రానికి సీఎం రేవంత్ డిమాండ్
- నిధుల విడుదలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు
- మెట్రో ఫేజ్-2 నిర్మాణంలో భాగస్వామ్యంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి

2

## తెలంగాణను ఎగుమతి బియ్యం హబ్‌గా తీర్చిదిద్దుతాం



-విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్..

-వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ

ధర్మఘంట :రాష్ట్రంలో 8 మేలురకం వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎగుమతి రకాల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీకి మిగతా2లో

## మోదీ హామీల లెక్క తేల్చండి

**ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి**




కేటీఆర్ చెప్పిందే కిషన్‌రెడ్డి చేస్తున్నారు..

ధర్మఘంట : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు. సోమవారం సచివాలయంలో మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీలు ఎంతవరకు అమలయ్యాయో దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2లో




## ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకం ప్రారంభం..

- వేసవి సెలవుల అనంతరం తెలంగాణలో పాఠశాలలు పునఃప్రారంభం
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించిన సర్కార్
- వారంలో మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి మాల్ట్ పంపిణీ
- విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక సందేశం
- రాష్ట్రవ్యాప్తంగా 1,269 పాఠశాలల్లో 1.44 లక్షల మందికి ప్రయోజనం

ధర్మఘంట :వేసవి సెలవుల అనంతరం తెలంగాణ వ్యాప్తంగా సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కొత్త విద్యా సంవత్సరం తొలి రోజు నుంచే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అల్పాహార పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలోని 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తుండగా, దీని ద్వారా సుమారు 1.44 లక్షల మంది మిగతా2లో




## ధాన్యం కొనుగోలులో తెలంగాణపై కేంద్రం వివక్ష

ధర్మఘంట :తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర , ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం -మిగతా2లో



2

## తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యం

**ఢిల్లీలో పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు**

- తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యమెందుకని ప్రశ్న
- రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచిందన్న పవన్ కల్యాణ్
- తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల కోసం జనసేన పనిచేస్తుందన్న పవన్


హర్మ్యూజ్ తెరుచుకుంది.. 12
పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గుతాయా? 2
-అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం
-అంతర్జాతీయ మార్కెట్లో దిగొచ్చిన చమురు ధరలు

భూపాలపల్లి సింగరేణి గనిలో పేలిన మందుగుండు

12 తెలంగాణకు చల్లని కబురు


## దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తున్నారు



కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు.

- కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మోదీ శుభాకాంక్షలు
- కష్టపడే నాయకుడని ప్రశంసలు
- బొగ్గు, గనుల రంగంలో సంస్కరణలు చేపట్టారని కితాబు
- అమిత్ షా సహా ఇతర కేంద్ర మంత్రులూ శుభాకాంక్షలు

2లో

## పశ్చిమాసియాలో శాంతికి మార్గం



- అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరినట్టు ప్రకటన
- హర్మ్యూజ్ జలసంధిని తిరిగి తెరవనున్నట్టు ప్రకటించిన ట్రంప్
- ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ.. శాంతి నెలకొనాలని ఆకాంక్ష

2లో

## 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు..



- వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతం నిఘా అవసరం..
- విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలి..
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తెలంగాణ పత్రిక :వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురుకాకుండా ముందస్తుగానే అన్ని అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా మిగతా12లో

# తెలంగాణను ఎగుమతి బియ్యం హబ్‌గా తీర్చిదిద్దుతాం

-మొదటిపేజీ **తరువాయి:** రాష్ట్రంలో 8 మేలురకం వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎగుమతి రకాల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచనలు చేశారని తెలిపారు. ఆ 8 రకాల వంగడాలతోనే రైతులకు లాభాలు వస్తాయని వివరించారు.

**విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్..**

విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్ ఉందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని వెల్లడించారు. ధీరు-5204, తెలంగాణ సోనామసూరి సహా ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలపై రైతన్నలు దృష్టిపెట్టాలని సూచించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆదరణ ఉన్న బియ్యం ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచే పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని సూచించారు. రైతులకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై మార్గనిర్దేశం చేయాలని నిర్ణయించామని అన్నారు. డిమాండ్ లేని వరి రకాల సాగును క్రమంగా తగ్గించాలని చెప్పారు. వినియోగదారులు, మిల్లర్లు కోరుకునే వరి రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ..**

ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాల సాగు విస్తరణపై దృష్టి పెట్టాలని భట్టి విక్రమార్క మార్గనిర్దేశం చేశారు. వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రైతులకు నష్టాలు రాకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల ప్రణాళిక చేపట్టాలని సూచించారు. నాణ్యమైన బియ్యం ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించామని చెప్పారు. రైతులకు లాభదాయకమైన, ఎగుమతి అవకాశాలు ఉన్న వంగడాలపై ప్రత్యేక ప్రోత్సాహకాలని పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలపై నిరంతర సమీక్షా సమావేశాలు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. తెలంగాణను అధిక విలువ కలిగిన వరి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. రైతు ఆదాయం పెంపు, మార్కెట్ అనుసంధానానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించామని అన్నారు. రైతులకు మెరుగైన ధరలు వచ్చేలా మార్కెట్ డిమాండ్ ఆధారిత వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు.

## మెట్రో నిధులు రూ.13,600 కోట్లు ఇవ్వండి.. మెట్రో నిధులు రూ.13,600 కోట్లు ఇవ్వండి..

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1 రీఫైనాన్సింగ్ కోసం ఉద్దేశించిన రూ.13,600 కోట్ల టర్మ్ లోన్‌ను తక్షణమే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, మెట్రో ఫేజ్-2 నిర్మాణంలో కేంద్రం భాగస్వామిగా ఉంటుందో లేదో స్పష్టం చేయాలని, లేదంటే రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా పనులు చేపట్టేందుకు నిరభ్యంతర పత్రం ఇవ్వాలని కోరారు.ఎల్‌డటీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం మెట్రో ఫేజ్-1ను స్వాధీనం చేసుకున్న తర్వాత, అధిక వడ్డీ భారాన్ని తగ్గించుకునేందుకు జపాన్ ఏజెన్సీ నుంచి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (×=ఖీజ) ద్వారా తక్కువ వడ్డీకి రుణం పొందినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. జపాన్ ఏజెన్సీ ఇప్పటికే నిధులను ×=ఖీజకి బదిలీ చేసిందని, కానీ జూన్ 1న రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన ఆ మొత్తాన్ని కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణకు నిధులు రాకుండా అడ్డుకోవాలని కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్, అశ్విని వైష్ణవ్‌లను కలిసి కోరారని విమర్శించారు. "ఈ రోజు తెలంగాణకు రావాల్సిన రూ.13,600 కోట్లను విడుదల చేసే బాధ్యతను కిషన్ రెడ్డి తీసుకుంటారా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎల్‌డటీ సంస్థ ఫేజ్-1లో ఏటా రూ.400 కోట్ల నష్టాలను చవిచూస్తోందని, దీంతో వారు ఫేజ్-2 నిర్మాణానికి అంగీకరించలేదని రేవంత్ గుర్తుచేశారు. కేంద్రం సూచన మేరకే రాష్ట్ర ప్రభుత్వం మెట్రోను టేకోవర్ చేసిందని, ఇప్పుడు నిధులు రాకుండా అడ్డుకోవడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ జోక్యం చేసుకుని తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నిధులను విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మోదీ హామీల లెక్క తేల్చండి..

-మొదటిపేజీ **తరువాయి:** రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఖాతాలో రూ.15 లక్షల జమ వంటి కీలక హామీలు నెరవేర్చకపోయినా వాటిపై ఎవరూ ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. తన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కిషన్‌రెడ్డి ముందుగా వీటికి సమాధాని చెప్పాలని నిలదీశారు. ఎన్నికల హామీలు అమలు కాలేదనే కారణంతో ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, తాను కూడా తన కేబినెట్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సీఎం స్పష్టం చేశారు.మెట్రో విస్తరణను బీఆర్‌ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయి..

మెట్రో విస్తరణను బీఆర్‌ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. చీూజ ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు .రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం అయినా ఇప్పించరా? అని నిలదీశారు. నిధులు ఇప్పించి చీూజ ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు.కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

**కేటీఆర్ చెప్పిందే కిషన్‌రెడ్డి చేస్తున్నారు..**

కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్-1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఫేజ్-2 నిర్మించుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో ఈ విషయంలో అర్థమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకం ప్రారంభం

-మొదటిపేజీ **తరువాయి:** ఈ పథకం కింద విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మిగిలిన మూడు రోజులు రాగి మాల్ట్ అందిస్తారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులందరికీ ఈ అల్పాహారం వర్తిస్తుంది. ఇప్పటికే అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా విస్తరించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడం, హాజరు శాతం పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. చాలా రోజుల తర్వాత పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థుల సందడి నెలకొంది. కొత్త దుస్తులు, బ్యాగులతో విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టారు.

**విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు**

పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. "పాఠశాల కేవలం పాఠాలు నేర్పే ప్రదేశం కాదు. మన వ్యక్తిత్వాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయం. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని నేను గట్టిగా నమ్ముతున్నాను. అందుకే విద్యా రంగాన్ని అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు అనేక సంస్కరణలు చేపట్టాం" అని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు. "అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పౌష్టికాహారం అందించడమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ఉత్సాహంగా చదువుకోవాలి. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో జ్ఞానాన్ని సంపాదించి, మీ కలలను సాకారం చేసుకోవాలి. విద్య అనేది ఎవరూ దొంగిలించలేని గొప్ప సంపద" అని విద్యార్థులకు సూచించారు.

# పశ్చిమాసియాలో శాంతికి మార్గం..

-మొదటిపేజీ **తరువాయి:** ఈ ఒప్పందం అమలుతో పశ్చిమాసియాలో తిరిగి శాంతి, స్థిరత్వం నెలకొంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా కుదిపేసి, విస్తృత యుద్ధ భయాలకు కారణమైన ఈ వివాదం ముగింపు దిశగా సాగడం ఒక ముఖ్యమైన పరిణామం. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందం పూర్తయినట్టు ప్రకటన చేశారు. చరిత్రాత్మక దౌత్య విజయంగా అభివర్ణిస్తూ, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ముగించడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని తెలిపారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! హర్మూజ్ జలసంధిని టోల్ లేకుండా తిరిగి తెరిచేందుకు నేను పూర్తి అధికారం ఇస్తున్నాను. అదే సమయంలో అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తక్షణమే తొలగించాలని ఆదేశిస్తున్నాను. ప్రపంచ నౌకలారా, మీ ఇంజిన్లు ప్రారంభించండి" అని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఒప్పందంపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అంతరాయానికి, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైన పశ్చిమాసియా వివాదానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనను నేను స్వాగతిస్తున్నాను. ఈ ఒప్పందం అమలుతో ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడంతో పాటు నౌకాయాన స్వేచ్ఛ, వాణిజ్యం సజావుగా సాగుతాయని భారత్ ఆశిస్తోంది. మిగిలిన అంశాలపై కూడా చర్చలు జరిగి, సుస్థిరమైన తుది ఒప్పందం కుదురుతుందని ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు. మరో పోస్టులో ట్రంప్ ఈ ఒప్పందాన్ని చారిత్రక విజయంగా అభివర్ణించారు. "ఈ గొప్ప ఒప్పందం మొత్తం ప్రాంతానికి శాంతి, భద్రతను తెస్తుంది. గతంలో ఎందరో అధ్యక్షులు ఇరాన్‌తో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ప్రాంత నాయకులు, నిజమైన శాంతిని సాధించడంలో సహాయపడగల అధ్యక్షుడిని మొదటిసారి కనుగొన్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంపై శుక్రవారం అధికారికంగా సంతకాలు జరుగుతాయని, జలమార్గంలోని మైన్‌లను తొలగించే ప్రక్రియతో పాటే జలసంధిని తిరిగి తెరుస్తారని ట్రంప్ తెలిపారు. అయితే, ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను ట్రంప్ వెల్లడించలేదు. వైట్ హౌస్ నుంచి కూడా అధికారికంగా ఎలాంటి పత్రాలు విడుదల కాలేదు. ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా విధించిన ఆంక్షల వంటి దీర్ఘకాలిక సమస్యలపై ట్రంప్ తన పోస్టులలో ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతానికి మాత్రం హార్మూజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల స్వేచ్ఛాయుత రవాణాను పునరుద్ధరించడమే ఈ ఒప్పందం తక్షణ లక్ష్యంగా కనిపిస్తోంది.

## మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు

-మొదటిపేజీ **తరువాయి:** రాజకీయంగా నష్టం జరుగుతుందనే కుట్ర పన్నుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీ కలిసే మెంట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ విషయాలపై కేంద్రాన్ని అడిగితే.. కింద సమస్యలు ఉన్నాయని తెలిపినట్లు వెల్లడించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని, అంతా మేమే భరిస్తాం, కేవలం ఎన్‌ఓసీ ఇవ్వండి కేంద్రం భాగస్వామ్యం లేకుండా నిర్మిస్తామన్నాం. సమస్యలపై చర్చిద్దామంటే కిషన్‌రెడ్డి సమయం ఇవ్వట్లేదని రేవంత్ అన్నారు. ఆయనపై ఎలాంటి కోపం లేదని తెలిపారు. కేవలం ఆయన నుంచి సహకారం మాత్రమే కోరుకుంటున్నా నన్నారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతి, నిధులు ఇచ్చారని, విశాఖ మెట్రో నిర్మాణానికి కూడా అనుమతులు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, హైదరాబాద్ మెట్రోకు నిధులతో పాటు అనుమతులూ లేవని విమర్శించారు. అక్కడే వివక్ష ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని ఆరోపించారు. కేసీఆర్‌కు కిషన్ రెడ్డి లొంగిపోయారని రేవంత్ ఆరోపించారు. ఆయనకు అంత తెలివిలేదంటూ ఘాటు విమర్శలు చేశారు. కేటీఆర్ చెప్పినట్లు నడుచుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన డైరెక్షన్‌లోనే కిషన్‌రెడ్డి వెళ్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మెట్రో నిర్మాణాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మించలేదన్నారు. ఇప్పుడు దాన్ని సరిచేసుకుంటామంటే వివిధ రకాలుగా అడ్డు తగులుతున్నారని ఆరోపించారు.

## ధాన్యం కొనుగోలులో తెలంగాణపై కేంద్రం వివక్ష

-మొదటిపేజీ **తరువాయి:** కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి, ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా కూడా ఎందుకు తమపై ఇంత వివక్ష అని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించిన అన్ని రకాల ధాన్యాలనూ సేకరించాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటూ, రాష్ట్ర రైతాంగాన్ని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కేంద్రం చేతులెత్తేసినా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకాడలేదని, ఇప్పటికే 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నతో పాటు, 2 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈ ధాన్యం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు.

## భూపాలపల్లి సింగరేణి గనిలో పేలిన మందుగుండు..

-మొదటిపేజీ **తరువాయి:** జిల్లాలోని సింగరేణి సంస్థకు చెందిన కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీకే) 5వ గనిలో సోమవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గని లోపల బొగ్గు ఉత్పత్తి పనుల్లో భాగంగా బ్లాస్టింగ్ నిర్వహిస్తుండగా ఊహించని విధంగా మందుగుండు చేతిలోనే పేలిపోయింది. ఈ ఘటనలో శ్రీరాముల ప్రదీప్ అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. గని అంతర్భాగంలోని 13వ లెవెల్‌లో బొగ్గును వెలికితీసేందుకు మందుపాతరలు అమర్చి బ్లాస్టింగ్ ప్రక్రియను చేపట్టారు. అయితే, ఆ సమయంలో మందుగుండు హఠాత్తుగా చేతిలోనే పేలడంతో ప్రదీప్ ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడే ఉన్న తోటి కార్మికులు అప్రమత్తమై, తీవ్ర రక్తస్రావంతో ఉన్న ప్రదీప్‌ను.. భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న సింగరేణి ఉన్నతాధికారులు.. గని వద్దకు చేరుకుని సమగ్ర విచారణను ప్రారంభించారు.

## దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తున్నారు.

-మొదటిపేజీ **తరువాయి:** బొగ్గు, గనుల రంగాల బలోపేతానికి కిషన్‌రెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు. సోమవారం 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోదీ.. కిషన్‌రెడ్డి కష్టపడి పనిచేసే నాయకుడని పేర్కొన్నారు. సంస్కరణలు, విధానపరమైన చర్యల ద్వారా బొగ్గు, గనుల రంగాల్లో మార్పు తీసుకురావడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని కొనియాడారు. కిషన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. దేశాన్ని ఇంధన రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలన్న మోదీ లక్ష్యాన్ని సాకారం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం కిషన్‌రెడ్డి సేవలను ప్రశంసించారు. బొగ్గు, గనుల రంగాల అభివృద్ధి, ఆధునికీకరణ కోసం ఆయన చేస్తున్న కృషి దేశ పురోగతికి దోహదపడుతోందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ప్రహ్లాద్ జోషి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖులు కూడా కిషన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యం..

-మొదటిపేజీ **తరువాయి:** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 12 ఏళ్లు గడుస్తున్నా, ఉద్యమ అమరవీరులను సముచితంగా గుర్తించి గౌరవించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో సుమారు 1,200 మంది ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "ప్రజలు ప్రాణత్యాగాలు చేసేంత గొప్ప నేల అది. అందుకే నాకు ఆ నేల పట్ల, అక్కడి ప్రజల పట్ల ఎంతో గౌరవం ఉంది. ఒక లక్ష్యం కోసం ఇంతమంది ఆత్మబలిదానాలు చేసుకుంటారా అనిపించింది" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అమరవీరులకు నివాళులర్పించేందుకు తాను వెళ్లాలని భావించగా, ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని ఈ సందర్భంగా ఆరోపించారు. యువతను బలిచేసి కొందరు నాయకులు తెలంగాణలో అధికార పీఠాన్ని అధిరోహించారని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమ అసలు ఆకాంక్షల సాధన కోసం జనసేన నిరంతరం శ్రమిస్తుందని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఉండి భవిష్యత్తు ప్రయోజనాల కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన కొప్పుల వెంకట్ రెడ్డి





-రాజేంద్రనగర్ ఆర్డీఓగా పనిచేసిన కొప్పుల వెంకట్ రెడ్డికి పదోన్నతి

పెద్దపల్లి, ప్రతినిధి జూన్15 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కొప్పుల వెంకట్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)గా విధులు నిర్వహించిన కొప్పుల వెంకట్ రెడ్డికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పదోన్నతి లభించడంతో పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్న ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను కలుసుకున్న కొప్పుల వెంకట్ రెడ్డి, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

-ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి

పెద్దపల్లి, ప్రతినిధి జూన్ 15 ( తెలంగాణ పత్రిక )

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి పెద్దపెల్లి జిల్లాలో అదనపు కలెక్టర్ రెవెన్యూగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరితో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ముత్తారం మండలం లక్కారం గ్రామ పంచాయతీ కు చెందిన వీరగొని రాజేశం మచ్చ పేట గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 79 లో ఎకరం 33 గుంటల వ్యవసాయ భూమి చట్టబద్ధంగా కొనుగోలు చేయడం జరిగిందని, తన భూమిని అధికారికంగా పున సర్వే చేయించి సంబంధిత రెవెన్యూ రికార్డులలో ఉన్న తప్పులను సరిచేసి చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.



ఓదుల గ్రామ పంచాయతీ పరిధిలో మంజూరైన ప్రీ ప్రైమరీ స్కూల్ సెంటర్ ను హై స్కూల్ ప్రాంగణంలోకి మార్పు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచి కనకిరెడ్డి సతీష్ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు గోదావరిఖని కళ్యాణ్ నగర్ కు చెందిన కొత్తపల్లి సమ్మక్క తన ఇంటి వెనకాల ఉన్న కోత్వాల్ వెంకటేష్ అక్రమంగా మా ఇంటి సరిహద్దులను ఆక్రమంగా చొర పడుతున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగారామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు పెద్దపల్లి పట్టణం ప్రగతి నగర్ కు చెందిన కొండా రమాదేవి తమకు గృహ జ్యోతి పథకం కింద లబ్ధి చేకూర్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపీడీఓ కు రాస్తూ అవసరాన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ కేంద్రమా, అదిరి పోయే దోపిడీ కేంద్రామా..?

-చూపించే రేటు ఒకటి. వసూలు చేసే రేటు మ(రొ)కటి!

-సేవ పేరుతో షేవ్.అప్డేట్ కు పోతే జేబుకి చిల్లే

పెద్దపల్లి, ప్రతినిధి జూన్ 15 ( తెలంగాణ పత్రిక )

ఒకప్పుడు దోచుకునే విధానం వేరేగా ఉండేది . ఇప్పుడు పట్టపగలే కంప్యూటర్ ముందు కూర్చొని రసీదు పేరుతో అదొక రకంగా దోచుకునే రోజులు వచ్చాయి. జిల్లాలోని అనేక ఆధార్ సేవా కేంద్రాల్లో జరుగుతున్న వ్యవహారాలు చూస్తే "సేవ" అనే పదం ప్రారంభమై షేవ్ గా మార్పు చెందినదిగా మారిందని చెప్పుకునే పరిస్థితి వచ్చింది ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు ఒకటైతే... కేంద్రాల్లో వసూలు చేస్తున్న రుసుములు ఇంకోటి. ఆధార్‌లో పేరు సరిచేయించుకోవాలన్నా, చిరునామా మార్చుకోవాలన్నా, మొబైల్ నంబర్ జోడించాలన్నా... ప్రజలు వెళ్లేది సేవ కోసం. కానీ అక్కడ ఎదురయ్యేది షేవ్.

సరైనట్టు పత్రాలు ఉంటే ఒక రేటు.లేకపోతే మరోక సపరేటు రేటు.

-ఆధార్ కేంద్రాల్లో ఇప్పుడు కొత్త ఫార్ములా నడుస్తోందట.

"పేపర్లు తెచ్చావా..? అయితే ఇంత. తెచ్చుకోలేదా..? అయితే అంత!" అనే దందా నడుస్తున్నది.

అసలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు ఎంత? కేంద్రం వసూలు చేస్తున్నది ఎంత? అనే లెక్కలు ప్రజలకు తెలియకుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు నిర్వాహకులు అయితే "ఆధార్ అప్డేట్"




పేరుతో చిన్న పని చేసినా పెద్ద బిల్లు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బోర్డులు ఉన్నాయా.? ఉంటే ఎవరికోసం.?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి కేంద్రంలో సేవల వివరాలు, ఫీజుల జాబితా స్పష్టంగా ప్రదర్శించాలి. కానీ చాలా చోట్ల ఆ బోర్డులు కనిపించవు. కనిపించినా దుమ్ము పట్టి ఉంటాయి. ఎందుకంటే వాటిని చదివితే ప్రజలు ప్రశ్నించే ప్రమాదం ఉంది కదా!

-అందుకే కొందరు నిర్వాహకుల సిద్ధాంతం ఒక్కటే...

రేటు అడిగితే చెప్పేది మనం... డబ్బు ఇచ్చేది వాళ్ళు... మధ్యలో ప్రభుత్వం ఎందుకు?

-దోచుకున్నోనికి దోచుకున్నంత..!

ప్రజలకు ఆధార్ తప్పనిసరి. పింఛన్ కావాలన్నా, రేషన్ కావాలన్నా, బ్యాంకు పని కావాలన్నా ఆధార్ ఉండాల్సిందే. ఆధార్ లేనిది అడుగు ముందుకు పడే పరిస్థితి లేదు. ఈ అవసరాన్నే పెట్టుబడిగా మార్చుకుని కొందరు కేంద్రాల నిర్వాహకులు "ఎంత వీలైతే అంత" అన్న ధోరణితో వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒక్కోసారి ప్రజలు అడిగితే.సిస్టమ్ ఛార్జీలు సర్వర్ ఛార్జీలు ప్రింట్ ఛార్జీలు ఫోటో ఛార్జీలు

అంటూ కొత్త కొత్త పేర్లు కూడా జతచేస్తున్నారట. చూస్తుంటే ఆధార్ అప్డేట్ కంటే ఛార్జీల అప్డేట్ వేగంగా జరుగుతున్నట్లు అనిపిస్తోంది.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?

-ప్రభుత్వ నిబంధన లు బే ఖాతార్

ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం చూస్తూ ఊరుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎప్పటికప్పుడు తనిఖీలు జరిగి, ఫీజుల జాబితా తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటే ఈ దోపిడీకి కొంతైనా అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.ఆధార్ సేవా కేంద్రాలు ప్రజలకు సేవ చేయడానికా..? లేక ప్రజల జేబులు ఖాళీ(షేవ్ )చేయడానికా..?

-ప్రభుత్వం నిర్ణయించిన రుసుములు ఒకవైపు ఉంటే, కేంద్రాల్లో వసూలు చేస్తున్న రేట్లు మరోవైపు ఉండటం చూస్తే...

"ఆధార్ కార్డు అప్డేట్ అవుతుందో లేదో తెలియదు గానీ... జేబు మాత్రం ఖచ్చితంగా డిలీట్ అవుతోంది!"

-అనే వ్యాఖ్యలు ప్రజల నోళ్లలో వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి ఆధార్ కేంద్రాల్లో జరుగుతున్న ఈ నిలువు దోపిడీపై దృష్టి సారించి, ప్రజలపై పడుతున్న అదనపు భారం తొలగించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

# విద్యార్థులకు గులాబీలతో స్వాగతం

పాపన్నపేట, జూన్ 15:(తెలంగాణ పత్రిక)

బడి ప్రారంభం సందర్భంగా వినూత్న రీతిలో విద్యార్థులకు స్వాగతం పలికారు. మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో వేసవి సెలవుల అనంతరం మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి, పాఠశాల హెచ్ఎం మహేశ్వర్ చేతుల మీదుగా విద్యార్థులకు గులాబీ పూలతో స్వాగతం పలుకుతూ పాఠ్యపుస్తకాలు ,పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రభుత్వ బడిలోనే అందుతుందన్నారు.



విద్యావంతులైన ఉపాధ్యాయులు కేవలం ప్రభుత్వ బడిలోనే ఉంటారని, తమ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ బడులకు పంపాల్సిందిగా ఆయన తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశం, అంజాగౌడ్, ప్రవీణ్, భట్టు నాగరాజు, వేణుగోపాల్ రెడ్డి, మంగ నర్సింలు, యాదయ్య, మోహన్ రావ్, నింగప్ప, రియాజ్, కృష్ణ కాంత్, శ్రీహరి, రవికాంత్ ,విశ్వనాథ్ , సుభాష్ , మహమూద్ హన్నన్, ఇందిర, పద్మ , జకెరా, లక్ష్మీ, రజిత తదితరులు పాల్గొన్నారు.

## వరుణ దేవుడి కరుణ కోసం కప్పతల్లి ఆడిన మహిళలు



చందుర్తి, జూన్ 15,తెలంగాణ పత్రిక.

వరుణదేవుడి కరుణ కోసం చందుర్తి మండలం కిష్టంపేట గ్రామం లో మహిళ రైతులు, చిన్నారులు సోమవారం కప్పతల్లి ఆట ఆడారు.ఈ మేరకు గ్రామం లో రైతులు వరుణదేవా కరుణించు అంటూ ఆలయాల్లో జలాభిషేకాలు చేశారు. మహిళలు మంచినీటి బిందెలతో నీరు తెచ్చి హనుమాన్, ఆలయంలో జలాభిషేకం చేశారు. మంచినీటి బిందెలను పట్టుకొని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కప్పతల్లి ఆడారు. వరుణుడు కరుణించి వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు చేశారు.

## టెట్ పరీక్షలకు సర్వం సిద్ధం జిల్లా కలెక్టర్ అంకిత్




భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 15

జిల్లాలో నిర్వహించనున్న టీజీ టెట్ జూన్--2026 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 16 నుండి జూన్ 22 వరకు మొత్తం ఐదు రోజుల పాటు పది సెషన్లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు .

జిల్లాలో మొత్తం 1,217 మంది అభ్యర్థులు టెట్ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం పాల్వంచలోని అనుబోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేసి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్, ఇంటర్నెట్, తాగునీరు, భద్రతా ఏర్పాట్లు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రానికి చేరుకుని హాల్ టికెట్‌తో పాటు సంబంధిత గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు పరీక్షా నిబంధనలను తప్పనిసరిగా పాటించి విజయవంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు.

## క్యాన్సర్ బాధితురాలికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆర్థిక సహాయం



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 15, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి లత క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆమె కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం వ్యక్తిగతంగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ప్రభుత్వం తరపున మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్యాన్సర్ వంటి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటలాడుతున్న సర్కార్

-పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి.
-జీవో నెంబర్ 7ను వెంటనే ఎత్తేయాలి.
-తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు పోగుల సైదులు గౌడ్.



మిర్యాలగూడ ప్రతినిధి //జూన్15:(తెలంగాణ పత్రిక):-

తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు పోగుల సైదులు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సర్కార్ విద్యార్థుల జీవితాలతో చెలగాటలాడుతుందని అన్నారు ప్రభుత్వం జీవో నెంబర్ 7ను వెంటనే రద్దుచేసి పెండింగ్ బకాయలు చెల్లించాలని కోరారు. విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చే పనులు తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు అలివికాని హామీలతో అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు నెరవేర్చడానికి విద్యార్థుల జీవితాలతో చెలగాటలాడితే సహించేది లేదని హెచ్చరించారు. మీ హామీల అమలు పరచడానికి పథకాలు నిర్వర్తించడానికి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దన్నారు విద్య విద్యార్థుల హక్కు అని కొట్లాడి సాధించుకుంటామని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

-మిర్యాలగూడలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి
-పాఠశాలల పునఃప్రారంభ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 15:(తెలంగాణ పత్రిక):-

నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన తొలి రోజు సందర్భంగా ఎమ్మెల్యే పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఆధునిక తరగతి గదులు, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన బోధనతో ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి విద్యార్థి విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## వంద ఫీట్ల రోడ్డు విస్తరణ ప్రచారానికే పరిమితం అయింది

-విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి,జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత.

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూన్ 15



అనంతరం ప్రజావాణిలో యావర్ రోడ్డు పై అక్రమ నిర్మాణాలు, యావర్ రోడ్డు విస్తరణ అంశాలపై ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. యావర్ రోడ్డు విస్తరణ ప్రధాన అంశంగా పేర్కొంటున్నారు.1994 లో మాస్టర్ ప్లాన్ 60 ఫీట్లకు అనుమతి వచ్చింది.నేను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు అందర్నీ ఒప్పించి యావర్ రోడ్డు గతంలో 40 ఫీట్లు నుండి 60 ఫీట్లు విస్తరించిన. అనంతరం యావర్ రోడ్డు 100 ఫీట్లకు విస్తరించాలని తీర్మానం చేసి, ప్రభుత్వానికి. నీవేదించారు.100 ఫీట్ల రోడ్డు విస్తరణ ప్రచారానికే పరిమితం అయింది.నేను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డినీ కల్సి నివేదించగా, కలెక్టర్ ఆదేశాలు జారీచేయగా, విస్తరణకు 100 కోట్లు అవసరం అవుతాయని డిసెంబర్ 24 న ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సీఎం తో కలిసి పనిచేస్తుననీ అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ లో చేరారా లేదా తెలియదు..! ఎమ్మెల్యే సంజయ్ రెండేళ్లుగా సీఎం తో కలిసి పని చేస్తున్నారు.అభివృద్ధి కోసమే ఎమ్మెల్యే సీఎం తో కల్సి పని చేస్తున్నా అంటున్నారు. అలాంటప్పుడు ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ కు కల్సి యావర్ రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని అనడం విడ్డూరంగా ఉంది.యావర్ రోడ్డు పై అక్రమంగా నిర్మాణం చేపట్టిన భవనాలు తొలగించాలని కలెక్టర్ కు లేఖ రాశాను.కనీసం అక్రమ నిర్మాణాలు తొలగించండని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేసి ఆరు నెలలు గడుస్తుంది.అక్రమ నిర్మాణాలు తొలగించకుండా, రోడ్డు మీద పొట్టపోసుకునే వారి మీద ప్రతాపం చూపిస్తున్నారు.గతంలో రోడ్డు పై అక్రమ నిర్మాణాలు తొలగించండి అని నేను చెబితే ఇల్లు కూల్చుమన్నామని నా పేరు బద్నాం చేశారు. ప్రభుత్వం వద్ద ఫైల్ సిద్ధంగా ఉంది. రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్న అన్నారు. మున్సిపాలిటీకి చెందిన సర్వే నెంబర్ 138 లో 20 గుంటలు పెట్రోల్, డీజీల్, కిరోసిన్ ఔట్లేట్ కోసం కేటాయిస్తే కేవలం 4 గుంట లు మాత్రమే వినియోగిస్తూ మిగిలినది,వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. నిరుపేదలు ఆక్ర మించుకుంటే హైడ్రా ఉపయోగించి కుల్చుతున్నారు. ఇక్కడ పెట్టుబడిదారులు ప్రభుత్వ ఆస్తిని ఆక్రమిం చుకుంటే పట్టించుకోడం లేదు.కిబాల ద్వారా ఆస్తి పొందిన అని చెబుతున్న, ఇంతవరకు కిబాల ఒరిజినల్ డాక్యుమెంట్ వెలుగులోకి రాలేదు. అక్రమ నిర్మాణాలు తొలగిస్తారా లేదా ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ ఇదేవిధ ంగా కొనసాగించా లనుకుంటు న్నారా..? అక్రమ నిర్మాణాలు తొలగించడం ఎమ్మెల్యే బాధ్యత..కాదా..? ఎమ్మెల్యేకు సీఎం పవర్ ఆఫ్ పటార్నీ రాసిచ్చారా..? ఏ పని జరగాలన్నా,ఏ కాంట్రాక్ట్ జరగాలన్నా ఎమ్మెల్యే కనుసన్నల్లో జరగా లని అధికారం ఇచ్చారా..? హై కోర్టు ఉత్తర్వులు వచ్చిన తర్వాత కూడా నిర్మాణాలకు అనుమతి ఇచ్చా రు...! అనుమతి రెసిడెన్షియల్ కు ఇస్తే వాణిజ్య అవసరాలకు మార్పు చేశారు. ఇవన్నీ కలెక్టర్ దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకెళ్తే ఎటువంటి చర్యలు లేవు.జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టారా లేదా బహిర్గతం చేయాలి..? యావర్ రోడ్డు విస్తరణకు సీఎం తో కలిసి పనిచేస్తున్న ఎమ్మెల్యే కు 100 కోట్ల నిధులు మంజూరు చేయించడం పెద్ద విషయం కాదు.అక్రమ నిర్మాణాల నెపంతో నిరుపేదల పొట్ట కొట్టకండి.పెట్రోల్ బంక్ కు కేటాయించిన భూమిలో కేవలం 4 గుంటలు మాత్రమే ఉపయోగిస్తున్నారు. మిగిలిన భూమి ఇతర అవసరాలకు ఉపయోగి స్తున్నారు. జిల్లా కలెక్టర్ సర్వే నెంబర్ 138 కు సంబంధించి న్యాయ సలహా బహిర్గతం చేయాలి. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ప్రజా ప్రతినిధిగా ఎమ్మెల్యే సంజయ్ బాధ్యత. ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ పై కలెక్టర్ స్పందించాలి, అక్రమ నిర్మాణాలు తొలగిం చాలి. ఎమ్మెల్యే కు చిత్తశుద్ధి ఉన్నట్టయితే సీఎం తో కలిసి ప్రయాణం చేస్తున్నారు కాబట్టి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యత కాబట్టి,అక్రమ నిర్మాణాలు తొలగిం చాలని బీఆర్ ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నా ము అని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమవేశంలో మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా పరిషత్ తొలి మాజీ ఛైర్ పర్సన్ దావ వసంత సురేష్, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, జగిత్యాల మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, మాజీ చైర్మన్ దేశాయ్, బీఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు అయి ల్నేని వెంకటేశ్వర రావు, కౌన్సిలర్స్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిజిఎచ్ అభివృద్ధికి కృషి

-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూన్ 15



జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో స్థానిక శాసనసభ్యులు సంజయ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుపేద రోగులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు. జగిత్యాలలో 235 కోట్లతో నిర్మాణ దశలో ఉన్న 450 పడకల అత్యాధునిక నూతన ఆసుపత్రి భవన పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఈ కొత్త ప్రాజెక్టుతో జగిత్యాల జిల్లా ఉత్తర తెలంగాణలోనే ఒక పెద్ద హెల్త్‌కేర్ హబ్‌గా మారుతుందని, నిధుల సద్వినియోగం, మౌలిక వసతుల మెరుగుదలపై కలెక్టర్ వైద్య అధికారులతో కలిసి సుదీర్ఘంగా చర్చిం చారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఆసుపత్రిని ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, డిఎంహెచ్ఓ డా.సుజాత, హెచ్ డి ఎస్ సభ్యులు టీవీ సూర్యం, సిరిసిల్ల శ్రీనివాస్, సూపరిండెంట్ డా.కృష్ణ మూర్తి ,మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. సునీల్, ఆర్ఎంఓ డా.రామకృష్ణ, అర్డబి ఇఈ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు సత్వర సేవలందించడమే లక్ష్యం జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 15





ఐ డి ఓ సి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్ఓ పద్మావతితో కలిసి ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక సదుపాయాలు, రెవెన్యూ ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల సమస్యలను కేవలం నమోదు చేయడం కాకుండా, వాటి పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. వెంటనే పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని అన్నారు . ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించడం లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజావాణిలో అందిన కొన్ని వినతులు: టేకులపల్లి మండలం మొక్కంపాడు తండాకు చెందిన భూక్య సుమన్ తాను జన్మతః దివ్యాంగుడినని, అద్దె ఇంటిలో నివసిస్తూ జీవనం సాగించడం కష్టతరంగా మారిందని, ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తదుపరి చర్యల కోసం గృహ నిర్మాణ శాఖ పీడీకి ఎండార్స్ చేశారు. మణుగూరు మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన బట్ట కృష్ణవేణి తన కుమార్తె దివ్యశ్రీ ఆరో తరగతి ప్రవేశం కోసం గురుకుల ప్రవేశ పరీక్ష రాసినప్పటికీ సీటు రాలేదని, తమ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, ప్రైవేట్ పాఠశాలలో చదివించే స్తోమత లేదని పేర్కొంటూ గురుకుల పాఠశాలలో సీటు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. దీనిపై తగు చర్యల కోసం ఆర్‌సీఓ, సోషల్ వెల్ఫేర్‌కు ఎండార్స్ చేశారు. సుజాతనగర్ మండలం చిమ్న తండా గ్రామానికి చెందిన భూక్య సేవ తన తండ్రి 2010లో మరణించారని, మరణ ధ్రువీకరణ పత్రం కోసం పలుమార్లు మీ సేవలో దరఖాస్తు చేసినప్పటికీ తిరస్కరణకు గురవుతోందని తెలిపారు. ఈ కారణంగా తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరుపై మార్చుకోలేకపోతున్నానని, సమస్య పరిష్కరించి మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల కోసం సుజాతనగర్ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన స్వప్న తనకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, పూర్తిగా వర్షాధార సాగుపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నానని, బోరు విద్యుత్ సదుపాయం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ తదుపరి చర్యల కోసం ఐటీడీఏ పీవోకు ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం ధనియాలపాడు గ్రామ పరిధిలోని బాలాజీ తండాకు చెందిన భానోత్ అనూష తనకు సంబంధించిన రెండు వేర్వేరు భూముల భూభారతి రిజిస్ట్రేషన్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం సంబంధిత ధరణి అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. గ్రీవెన్స్ డేలో 24 ఫిర్యాదుల స్వీకరణ

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 15, తెలంగాణ పత్రిక**

ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 24 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితుల సమస్యలను చట్టప రంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.



ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించే విధంగా పోలీస్ శాఖ కృషి చేస్తోందన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి వినతులను స్వీకరించాలని సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఫిర్యాదుల పరిష్కారంతో ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం, భరోసా పెరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం గ్రీవెన్స్ డే ద్వారా లభిస్తుందని, వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

# నాంపల్లి గుట్టకు కొత్త ఆకర్షణ.. ఎయిర్ ఫోర్స్ విమానం ఏర్పాటుకు పనులు వేగవంతం

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 15, తెలంగాణ పత్రిక**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దత్తత దేవాలయమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొలువైన నాంపల్లి గుట్ట త్వరలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దు కోనుంది. గుట్టపై భారత వైమానిక దళానికి చెందిన విమానాన్ని ఏర్పాటు చేసేందుకు చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంతో నాంపల్లి గుట్టపై ఎయిర్ ఫోర్స్ విమానాన్ని ప్రతిష్ఠించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో విమానం విడిభాగాలను ప్రత్యేక వాహనాల ద్వారా సోమవారం గుట్టపైకి



తరలించారు. ఇప్పటికే విమానం ప్రధాన భాగాలు గుట్టకు చేరుకోగా, వాటి అమరిక పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.విమానం ఏర్పాటు పూర్తయిన అనంతరం నాంపల్లి గుట్టకు వచ్చే సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు ప్రకృతి అందాలతో ఆకట్టుకునే ఈ గుట్టకు ఎయిర్ ఫోర్స్ విమానం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. స్థానికులు మాట్లాడుతూ.. విమానం ఏర్పాటు పూర్తయిన తర్వాత నాంపల్లి గుట్ట జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా మరింత గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సమన్వయంతో కొనసాగుతున్న పనులు త్వరలో పూర్తికానుండగా, నాంపల్లి గుట్ట సందర్శకులను ఆకట్టుకునేలా కొత్త రూపును సంతరించుకోనుంది.

# ఉప్పులింగాపూర్‌లో శిశువు విక్రయం వ్యవహారం వెలుగులోకి?

**-పోషణ భారం కారణంగా మగ శిశువును విక్రయించినట్లు ఆరోపణలు**
**-ఐసీడీఎస్, పోలీసుల విచారణ ప్రారంభం**

**వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 15 (తెలంగాణ పత్రిక):**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామంలో శిశువు విక్రయం ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన ఎరుకలి సాయిలు కుమార్తె మమతకు గతంలో కౌడిపల్లి గ్రామానికి చెందిన చిన్నతో వివాహం జరిగింది. అయితే 2024 సంవత్సరంలో చిన్న మృతి చెందడంతో మమత తన పుట్టింటి అయిన ఉప్పులింగాపూర్‌లో తల్లిదండ్రుల వద్ద నివసిస్తోంది. ఈ క్రమంలో మమత గర్భం దాల్చి ఈ ఏడాది ఏప్రిల్ 17న మగ శిశువుకు జన్మనిచ్చింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండటంతో



పాటు శిశువు పోషణ భారంగా మారిందనే కారణంతో గత రెండు నెలల క్రితం ఆ బిడ్డను విక్రయించినట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా, ఉప్పులింగాపూర్ తాండాలో సుమారు 25 రోజుల క్రితం మరో శిశువును కూడా విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనలపై సమాచారం అందుకున్న ఐసీడీఎస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు శాఖ



సిబ్బంది గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. శిశువు విక్రయం జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ ఘటన మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 15, తెలంగాణ పత్రిక**

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా 3వ మహాసభలు జిల్లా కేంద్రంలోని చేనేత వస్త్ర భవన్‌లో కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మహాసభలకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ బుర్రి ప్రసాద్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ తప్పెట్ల స్కైలాబ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా కామ్రేడ్ గన్నారం నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా గురిజాల శ్రీధర్, ఉపాధ్యక్షులుగా కుడుకల గిరిబాబు, మునిగే మాదూరి, జాయింట్ సెక్రటరీగా బండ రవికుమార్, జిల్లా కమిటీ సభ్యుడిగా గరిగే రవి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రధాన



కార్యదర్శి గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ.. తన ఎన్నికను ప్రకటించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్, జిల్లా నాయకత్వానికి వ్యవసాయ కార్మికుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లో వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేపడతామని తెలిపారు. వ్యవసాయ కూలీలకు 200 రోజుల ఉపాధి పని దినాలు కల్పించాలని, రోజువారీ వేతనాన్ని రూ.600కు పెంచాలని, నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే సెంటు భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, భూమిలేని వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కౌలు రైతులకు రూ.15 వేల ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పి అమలు చేయకపోవడంపై భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.వ్యవసాయ కార్మికులు, పేదల సమస్యలపై ఎల్లవేళలా అండగా ఉంటూ పోరాడుతామని పేర్కొన్నారు. నూతన కమిటీ ఎన్నికకు సహకరించిన ప్రజా సంఘాల నాయకులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# పాపిరెడ్డి కాలనీలో తాగునీటి కష్టాలు.వెంటనే పరిష్కారం చూపాలి

**-మంచినీటి సమస్యపై అధికారులకు వినతిపత్రం అందజేసిన మారబోయిన రవి యాదవ్**

**రంగారెడ్డి జిల్లా,శేరిలింగంపల్లి, జూన్ 15 (తెలంగాణ పత్రిక)**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పాపిరెడ్డి కాలనీలో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకుడు మారబోయిన రవి యాదవ్ సోమవారం నీటి సరఫరా శాఖ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. పాపిరెడ్డి కాలనీలో ఇంటి నంబర్ 20-115/9/ఎ నుండి బీరప్ప దేవాలయం వరకు ఉన్న ప్రాంతంలో మంజీరా తాగునీటి సరఫరా అతి తక్కువ ఒత్తిడితో జరుగుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. కానీ ప్రస్తుతం ప్రజల మౌలిక అవసరాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది. నీటి సమస్యతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికార యంత్రాంగం స్పందించకపోవడం బాధాకరం అని



విమర్శించారు. అలాగే, గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికి నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టారు. కానీ నేడు ప్రజలు కనీస తాగునీటి కోసం అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది” అని అన్నారు. పాపిరెడ్డి కాలనీలో నెలకొన్న నీటి ఒత్తిడి సమస్యను వెంటనే పరిష్కరించి ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే స్థానిక ప్రజలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత. ప్రజల హక్కుల సాధన కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతుంది అని మారబోయిన రవి యాదవ్ స్పష్టం చేశారు..

# మొహరం ఏర్పాట్లు చేయాలి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష



**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 15, తెలంగాణ పత్రిక**

మొహరం సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మొహరం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్ లో వివిధ శాఖల అధికారులతో సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్రీ.గడ్డం నగేష్ మాట్లాడుతూ..జిల్లాలోని అశూర్ ఖానాలలో పరిశుభ్రత పనులు చేయించాలని, విద్యుత్ దీపాలు, నీరు అందుబాటులో పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు కలుగకుండా ఏర్పాట్లు చేయిశీచాలని పోలీసులకు సూచించారు.సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

**-ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్**




**ముధోల్:15జూన్(తెలంగాణ పత్రిక)**

కొట్టుకుంటే ఒక్కరే గెలుస్తారని, రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్లేనని.. రాజీ మార్గమే రాజమార్గమని,లోక్ అదాలత్ ద్వారా సమన్యాయం సత్వర పరిష్కారం జరుగుతుందని ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 20 తేదీలోపు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.రాజీ పడదగిన కేసులో క్రిమినల్ సివిల్ తగాదా కేసులు, ట్రాఫిక్ చలన్ లు,ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు కక్షి దారులు రాజీ పడాలని సూచించారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బుల ను వృథా చేసుకోవద్దన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



**ముధోల్:15జూన్(తెలంగాణ పత్రిక)**

మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో వివిధ అనారోగ్య కారణాలతో దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీజేపీ నాయకులు సోమవారం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన అయిటోల్ల గంగాధర్ కు రూ.22500, హంగీర్గ సాయినాథ్ రూ .14500, మండలంలోని గన్నోర, చించాల, ముద్గల్ గ్రామాలకు చెందిన అప్పల రవీందర్ కు రూ .30వేలు, గట్టుపల్లి రవి రూ .25వేలు, రాజుల గోదావరి లకు రూ.11500 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మె ల్యే పవార్ రామారావు పటేల్ సీఎంఆర్ఎఫ్ సహాయనిధి ద రఖాస్తులు పెండింగ్ లో లేకుం డా చెక్కులను బాధితు లకు అందజేస్తున్నారన్నారు. ప్రభు త్వ పథకాలను అర్హులైన నిరు పేదలకు అందేందుకు ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నారని తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తాటివార్ రమేష్, ధర్మపురి సుదర్శన్, సాయినాథ్, తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్



కామారెడ్డి, జూన్ 15,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డిజిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 93 దరఖాస్తులు వచ్చాయని భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఉపాధి, గృహాలు, రెవెన్యూ , ఇతర శాఖలకు సంబంధించిన వినతులు ప్రజలు సమర్పించారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విక్టర్, గిరి, జెడ్పి సీఈవోచందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టాలి

-ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి పత్రాన్ని సమర్పించిన బిజెపి నాయకులు.



జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూన్ 15

జగిత్యాల జిల్లాలో ప్రైవేట్ విద్యా సంస్థలైన స్కూల్స్,కాలేజీ యజమాన్యాల దోపిడి మితిమీరి పోయిందని,అనుమతులు ఉన్న స్కూల్స్ కొన్ని అయితే,అనుమతి లేని స్కూళ్లను కూడా నడిపిస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడికి గురి చేస్తున్నారు.ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలలో కనీస వసతులైన పార్కింగ్,ఆట స్థలాలు లేకపోగా ఇరుకు గదుల్లో సామర్థ్యానికి మించి ఎక్కువమంది విద్యార్థులను కూర్చోబెడుతూ విద్య బోధన చేస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థికి అవసరమయ్యే బుక్స్,షూస్, డ్రెస్, మొదలైన వాటికి అధిక ధరలను నిర్ణయించి,తమ పాఠశాలలోనే కొనాలని షరతు విధిస్తున్నారు. ర్యాంకులు మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి పెంచడం వల్ల విద్యార్థులు మానసికంగా కృంగుబాటుకు గురవుతున్నారు. ఇలా అనేక లోపాలున్నప్పటికీ అధికారులు ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలతో చాటుమాటు వ్యవహారాలు సాగించడం వల్ల వారి ఆగడాలను నివారించేవారు లేకుండా పోతున్నారు.కాబట్టి పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడిని అరికట్టే విధంగా ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏసీఎస్ రాజు, సిపెల్లి రవీందర్,కౌన్సిలర్ లింగంపేట శ్రీనివాస్,22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి,ఆన్ కార్ సుధాకర్,చీటి చంద్రశేఖర రావు, జువ్వాడి శ్రీకాంత్ రావు,ఠాకూర్ కిషోర్ సింగ్,ఎర్ర శీను,ప్రమోద్ ఎండి సుమీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమికోన్నత పాఠశాల అకస్మీక సందర్శన

-మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి



గూడూరు మండల ప్రతినిధి:- జూన్ 15.(తెలంగాణ పత్రిక):-

మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడెం మండల కేంద్రం పరిధిలోని వేలుబల్లి ప్రాథమికోన్నత పాఠశాలను, మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మూర్తి ఆకస్మికంగా సందర్శించి, నూతనంగా మంజూరైన ప్రీ - ప్రైమరీ తరగతి గదిని, అన్ని తరగతి గదులను, వంటశాలను, ఆట స్థలాన్ని అదేవిధంగా మూత్రశాలలను క్షుణ్ణంగా పరిశీలించారు. తదానంతరం తరగతి గదులలో ఫ్లోరింగ్ చేయించిన సర్పంచ్ ను, సత్యనారాయణ మూర్తి డీఈవో. అభినందించాడు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గుమ్మడి లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్కం వీరస్వామి, వేలుబెల్లి సర్పంచ్ వజ్జ అక్షయ్ కుమార్, సిఆర్పి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పెద్దపీట





-రూ.45.50 లక్షల వ్యయంతో పలు విద్యా అభివృద్ధి పనుల ప్రారంభం

-విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలే లక్ష్యమని వెల్లడి

తెలంగాణ పత్రిక, జూన్ 15

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం అశ్వారావుపేట మండలంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే పలు విద్యా సంబంధిత అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా రెడ్డిగూడెం ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థులు, ఉపాధ్యా యులు, గ్రామస్తులతో మాట్లాడి పాఠశాల అవసరా లపై ఆరా తీశారు. అనంత రం తిరుమలకుంట గ్రామపంచాయతీ పరిధిలోని తోగ్గూడెం, తిరుమలకుంట కాలనీలలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలల వద్ద రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ప్రహరీ గోడలను ప్రారంభించారు. తదుపరి మొద్దులమడ గ్రామంలో ఇటీవల నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.4 లక్షల నిధులతో జీపీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను ప్రారంభించారు. దిబ్బగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని దురదపాడు ఎంపీయూపీఎస్ పాఠశాలలో బాలబాలికల కోసం రూ.4 లక్షల వ్యయంతో విడివిడిగా నిర్మించిన మల్టీ యూనిట్ టాయిలెట్లను ప్రారంభించారు. చివరిగా నారాయణపురం ఎంపీపీఎస్ పాఠశాలలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా విద్యార్థులకు ఉత్తమ విద్యా వాతావరణం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం తమ కృషి నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, పీసీసీ జిల్లా సభ్యులు తుమ్మా రాంబాబు, కోలా లక్ష్మీనారాయణ, మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


## వర్షాకాల సవాళ్లకు సైబరాబాద్ పోలీసుల సన్నద్ధత

-నీటి నిల్వలు, ట్రాఫిక్ సమస్యలపై కమిషనర్ సమీక్షలి

-వర్షాకాల సన్నద్ధతపై పోలీసు యంత్రాంగానికి దిశానిర్దేశం

-ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశం





రంగారెడ్డి జిల్లా, సైబరాబాద్, జూన్ 15, (తెలంగాణ పత్రిక)

రానున్న వర్షాకాలంలో నీటి నిల్వలు, ట్రాఫిక్ అంతరాయాలు, చెట్లు కూలిపోవడం వంటి అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ సోమవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. జూమ్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్, శాంతిభద్రతల అధికారులతో కలిసి పోలీస్ స్టేషన్ల వారీగా సమస్యాత్మక ప్రాంతాల పరిస్థితిని పరిశీలించారు. వర్షాల కారణంగా తరచూ నీటి నిల్వలు ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. వాతావరణ హెచ్చరికలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ప్రాంతాల్లో ముందస్తుగా సిబ్బందిని మోహరించాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి నిల్వలు అధికంగా ఉండే ప్రాంతాల్లో జాతీయ విపత్తు స్పందన బృందాలతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే శాంతిభద్రతల విభాగ అధికారులు అదనపు సిబ్బందిని రంగంలోకి దించి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. రోడ్లపై నీటి నిల్వల కారణంగా వాహనాలు నిలిచిపోవడం, ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. కొనసాగుతున్న రహదారి పనులు, పూర్తయిన అభివృద్ధి పనుల ప్రభావాన్ని కూడా సమీక్షిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. నీటి నిల్వలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో విధుల నిర్వహణ కోసం అధికారులకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలని, ప్రతి విభాగం పరస్పర సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర స్పందన అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి ట్రాఫిక్ అదనపు ఉప పోలీస్ కమిషనర్ హనుమంతరావు, ట్రాఫిక్ సహాయ పోలీస్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ట్రాఫిక్ మరియు శాంతిభద్రతల విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు..

## షబ్బీర్ అలీ పేరుతో రిలీజ్ అయిన ఆడియో నకిలీ ఇది పోలీసుల కు ఫిర్యాదు

కామారెడ్డి, జూన్ 15,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




తన పేరుతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ రును ఉపయోగిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఆడియో పూర్తిగా నకిలీదని, దానిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కామారెడ్డి జిల్లా పోసానిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త గిరెడ్డి మహేందర్ రెడ్డి సోమవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కామారెడ్డి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (డీఎస్పీ), కామారెడ్డి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు ఫిర్యాదు చేశారు. గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా పనిచేస్తూ వివిధ పదవులు నిర్వహించిన తాను, షబ్బీర్ అలీ తో ఎలాంటి ఫోన్ సంభాషణ జరపలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే జూన్ 12 రాత్రి నుంచి కొందరు వ్యక్తులు తాను మరియు షబ్బీర్ అలీ ఫోన్‌లో మాట్లాడుకున్నట్లుగా, కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించినట్లుగా, మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడినట్లుగా ఒక ఆడియోను సృష్టించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆడియో ప్రచారం అనంతరం తనపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు, దూషణలు జరుగుతున్నాయని, కొందరు వ్యక్తులు బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించడం, పార్టీని చీల్చడం, నాయకుల ప్రతిష్ఠను దెబ్బతీయడం లక్ష్యంగా ఈ కుట్ర జరిగి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కావున తాను షబ్బీర్ అలీ మాట్లాడినట్లుగా తప్పుడు వాయిస్ ఆడియోను సృష్టించిన వ్యక్తులను, అలాగే ఆ ఆడియోను సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేస్తున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. నకిలీ ఆడియో ప్రచారం వల్ల తన ప్రతిష్ఠకు తీవ్ర నష్టం కలిగిందని, ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి తనకు న్యాయం చేయాలని పిర్యాదు చేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్.

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూన్ 15

సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ వివిధ మండలాల నుంచి ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్నందున అధికారులు ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించి సమగ్ర విచారణ జరపాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈరోజు ప్రజావాణిలో మొత్తం 71 ఫిర్యాదులు, వినతులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఆర్డీవో సహా పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# తోపుచర్ల లో షీ టీమ్ పనితీరుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు

మాడ్గులపల్లి//నల్గొండ//జూన్ 15:(తెలంగాణ పత్రిక):-



నల్లగొండ జిల్లా ఎస్.పి శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్స్ పెక్టర్ కరుణాకర్ పర్యవేక్షణ లో ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచన మేరకు మిర్యాలగూడ షీటీమ్ ఏఎస్ఐ ఎన్ ప్రభాకర్, హెడ్ కాని స్టేబుల్ మహమ్మద్. హుస్సేన్, ఉమెన్ పి సి రాజేశ్వరి, హెచ్ జి మధు, బృందం సోమవారం మాడ్గులపల్లి మండలం తోపుచర్ల గ్రామంలో షీటీమ్ పని తిరుపై ప్రజలకుఅవగాహన కల్పించారు. యువతులువి ద్యార్థిణులు, మహిళల పై ఇంటి, బడి, గుడి, వీధిలలో ఎదుర్కొంటున్న వేధింపులను అరికట్టి మహిళలకు రక్షణ కల్పించడమే షీటిమ్ ప్రధాన లక్ష్యం అన్నారు. వివిధ ప్రాంతాలలో అనేక సందర్భాలలో వేధింపులకు గురై మానసిక శరీరక ఒత్తిడికి గురవు తున్న మహిళలు ఎక్కడి నుంచి అయిన షీటిమ్ కు సమాచారం అందించి తమను తాము రక్షించు కొని నిందితులను చట్టప్రకారం శిక్షించవచ్చు అన్నారు. మగ వారి వేధింపులను ప్రతిఘటించి వేధింపు లను ఎలా ఎదుర్కోవాలి నిందితుల బారినుంచి ఎలా తప్పించుకోవాలి, షీటిమ్ కు సమాచారం అందించి షీటీం సహాయము ఎలా పొందాలి. అత్యవసర పరిస్థితిలో డయల్ 100నెంబర్ కు ఎలా ఉపయోగించుకో వాలో మహిళలకు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాలలో యువత డ్రగ్స్ తో పాటు వివిధ రకాలైన మత్తు పదార్థాలకు అలవాటు పడి,చెడు వ్యసనాలకు చెడు స్నేహాలు కు వెళ్లి తమ నూరేళ్ళ బంగారు భవిష్యత్తును జీవితాలను చిన్నాభిన్నం చేసుకుని ఆగ మవుతున్నారన్నారు. మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు చెడు వ్యసనాలు స్నేహాల వల్ల కలిగే నష్టాలను, సత్పరివర్తన కలిగిఉంటే కలిగే ప్రయోజ నాలను వివరించారు. తల్లిదండ్రులు ఎక్కువగా ఫోన్ ను పిల్లలకు ఇవ్వకుండా ఇచ్చినప్పటికీ మీపిల్లలు ఎవరితో మాట్లాడుతున్నారు ఎంత సేపు మాట్లాడుతున్నారు ఎవరితో సహవాసం చేస్తున్నారనే విషయం పై ఒక కన్నువేసిఉంచాలని సూచించారు. మహిళలు యువతు లు విద్యార్థులు స్త్రీలు ఎవరైన స్వేచ్ఛగా స్వతంత్రంగా సమాజంలో తిరగా లని ఎవ్వరు ఎరకమైన వేధింపుల కు గురైన వెంటనే షీటీమ్ నెంబర్ కు ఫోన్, వాట్సాప్, మెయిల్, సోషల్ మీడియా, ప్లాట్ ఫామ్ ద్వారా, నేరు గా మరొకరి సహాయం ద్వారా గాని పిర్యాదు చేయాల న్నారు. షీ టీమ్ కు ఫిర్యాదు చేసిన వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచబడు తుందన్నారు. పట్టణాలతోపాటు పల్లెలో అవగాహన కల్పించడంతో అనేకమంది సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకొనిహాయిగా ఉంటు న్నారన్నారు. గ్రామాలలో ప్రజలు చిన్న చిన్న విషయా లకు పెద్దవి చేసుకొని పోలీస్ స్టేషన్, కోర్టులు, పెద్ద మనుషుల చుట్టూ తిరుగవద్దని ప్రతివిషయా న్నివిచక్షణతోఆలోచించినిర్ణయాలుతీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో యువతీ యువకులు మొబైల్ ఫోన్ ప్రభావం తో అనేకమైన చెడు వ్యసనాలకు గురవుతున్నారన్నారని, కొంతమంది మానసిక రోగు లుగా మారిపోతుండగా మరికొంత మంది ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని, ఎందరో ఎందుకు పనికిరాని సోమరులుగా సైకోలుగా మిగిలిపోతూ కుటుంబా నికి సమాజానికి పనికిరాక జీవితాలను చిన్నభిన్నం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు, గురువులు ఆఫీసర్లుచెప్పిన మాటవినిన దుచుకుంటేభ విష్యత్తుబాగుంటుందన్నారు. చెప్పుడు మాటలు వింటే భవిష్యత్ జీవితం చిన్నాభిన్నమవు తుందన్నారు ప్రతి ఒక్కరు. తమ సమస్యలను షీ టీమ్ దృష్టికితీసుకు వెళ్లి తమ సమస్యలను చెప్పుకొని పరిష్కరించుకొని ప్రశాతంగా జీవించాలని కోరారు. ఈకార్యక్రమం లో గ్రామ ప్రముఖులు మహిళలు యువకులు కిషోర్ బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోకుంటేడిఇఓ ఆఫీస్ ముట్టడిస్తాశీ

**-ఉమ్మడి జిల్లాల లంబాడి స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు ప్రకాష్ నాయక్**

కామా రెడ్డి, జూన్ 15,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాలోప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై ఎల్ ఎస్ ఓ అధిక ఫీజులు, అనుమతులు లేని అడ్మిషన్లపై ఆగ్రహం గుర్తింపు రద్దు చేయకపోతే గాడిదతో డీఈఓ ఆఫీసు ముట్టడిస్తాం హెచ్చరిక లంబాడి స్టూడెంట్ ఆర్గనేషన్ఉమ్మడి నిజాంబాద్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేసి అక్రమంగా అడ్మిషన్లు చేసిన, పుస్తకాలు అమ్మిన, అధిక ఫీజులు వసూలు చేసిన, అలాగే ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని ఎల్ ఎస్ ఓ డిమాండ్ చేసింది. ప్రైవేట్ స్కూళ్లపై ఆరోపణలు ఈ సందర్భంగా ఎల్ ఎస్ ఓ నాయకులు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో, మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలు అక్రమంగా అడ్మిషన్లు జరుపుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. జిల్లాలలో అనేక ప్రైవేట్ పాఠశాలలో ఇరుకైన గదిలలో, సరైన గాలి వెలుతురు లేకుండా అపార్ట్మెంట్లో నడిపిస్తున్నారు, ప్రభుత్వ నిషేధించిన ఆట స్థలాలు, మౌలిక వసతులు చాలా చోట్ల లేవు, విద్యార్థులకు రావణ చేసే పాఠశాల బస్సులు పరిస్థితి మరింత దారుణంగా ఉందని, ఫిట్నెస్ సర్టిఫికెట్లు లేని వాహనాలను అనుభవం లేని డ్రైవర్లతో నడిపిస్తున్నారు, ప్రభుత్వ అనుమతులు లేకుండా 9, 10 వ తరగతులకు అడ్మిషన్లు చేస్తున్నారని, ప్రవేట్ పాఠశాలల పర్మిషన్ లేకున్నా అడ్మిషన్ తీసుకోవడం జరుగుతుందన్నారు,క్వాలిఫైడ్ టీచర్లు లేకుండా విద్యార్థులపై కల్తీ విద్య కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. అధికారుల తీరుపై ఆగ్రహం ప్రభుత్వ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా స్పందించక పోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్ర లేచి ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేసి గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. చర్యలు తీసుకోకపోతే లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన ధర్నాలు అలాగే డీఈఓ ఆఫీసు ముట్టడి హెచ్చరిక లేకపోతే గాడిదతో డీఈఓ ఆఫీసు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ఈ కార్యక్రమంలో లంబాడి స్టూడెంట్ ఆర్గనేషన్ ఉమ్మడి నిజాంబాద్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్, పట్టణ అధ్యక్షుడు మల్లేష్, రాజు, రమేష్ ముదిరాజ్, మహేష్, గోపాల్, ప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా హకీమ్ జన్మదిన వేడుకలు





**-జన్మదినం నాడే బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం**

పోతంగల్ తెలంగాణ పత్రిక జూన్ 15.

పోతంగల్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సామాజిక సేవా కార్యకర్త డాక్టర్ ఎం. ఏ. హకీమ్ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన బాన్సువాడ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ హకీమ్ జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ కార్యాలయం ప్రారంభోత్స వం చేశారు. అనంతరం ఆయనకు పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..... హకీమ్ జన్మదిన వేడుకలను పోతంగల్ మండల పార్టీ కార్యాలయంలో చేసుకోవ డం చాలా అభినందనీయమని కొనియాడారు. ఆయన చేసిన సేవలను వెలకట్టలేమన్నారు. ఉమ్మడి మండలాలలోని వివిధ గ్రామాలలో విద్యాభ్యాసం కోసం విద్యార్థిని విద్యార్థులకు ఆర్థిక సాయం, అంత్యక్రియలకు, వివాహ వేడుకలకు, ఆంజనేయ స్వాములకు, పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు, ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ పేద కుటుంబాలు మన్ననలు పొందిన మహా గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన చేసిన సేవలను మేలును ఉమ్మడి మండలాలలోని ప్రజలు మరువలేరని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కులాలకు అతీతంగా ప్రతి కుటుంబాలకు ఆయనకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించిన మహా నాయకుడు అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ నాయకులకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేసే వ్యక్తిగా పేరు పొందారని వారు పేర్కొన్నారు. అనంతరం ఆయనకు పార్టీ కార్యకర్తలు వివిధ కుల సంఘాల నాయకులు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గ్రామాల అద్యక్షులు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సూదం నవీన్ రాష్ట్ర నాయకులు సాయిబాబా ఏత్తొండ మాజీ ఎంపీటీసీ ఫారుక్ కోటగిరి సీనియర్ నాయకులు తెల్ల రవికుమార్ డివిజన్ మాల మహానాడు అధ్యక్షులు మీర్జాపూర్ సాయన్న బ్యాగరి రాములు పుప్పల సైదయ్య ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సోంపూర్ పోచిరామ్ అరిఫ్ శ్రీనివాస్ సాయిలు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం.. తాపీ మేస్త్రీ మృతి



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 15, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ శివారులోని జయవరం వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కరీంనగర్ సమీపంలోని రేకుర్తి గ్రామానికి చెందిన దానే రమేశ్ (30) తాపీ మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వేములవాడ శివారులోని జయవరం వద్ద ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రమేశ్ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

# కబ్జా చెర వీడిన ప్రభుత్వ భూమి




అబ్దుల్లాపూర్ మెట్ జూన్ 15 ( తెలంగాణ పత్రిక):-

రంగారెడ్డి జిల్లా,అబ్దుల్లాపూర్ మెట్ మండలం,కుంట్లూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 24 ప్రభుత్వ భూమి లో ఆదివారం సెలవు రోజుల్లో ప్రీకాస్ట్ ప్రహరీ గోడలను నిర్మించినారు. దానిని తహసీల్దార్ ఆదేశాల మేరకు మండల గిర్దవర్,మండల సర్వేయర్,గ్రామ పాలన అధికారి రెవెన్యూ సిబ్బంది తో వెళ్లి ప్రభుత్వ భూమి అయిన సర్వే నెంబర్ 24 లో 500 గజాల ప్రభుత్వ భూమి ని గుర్తించి చుట్టూ వేసిన ఫెన్సింగ్ ను జేసీబీతో నేలమట్టం చేసి స్వాధీనం చేసుకున్నారు. అందులో ప్రభుత్వ భూమి సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిడ్డ ప్రాణం కోసం తల్లిదండ్రుల వేదన

**-వేడినీళ్ల ప్రమాదంతో చావుబతుకుల మధ్య చిన్నారి!**

కొత్తగూడ మండల ప్రతినిధి:- జూన్ 15.(తెలంగాణ పత్రిక):-



మహబూబాబాద్ జిల్లా, కడుపుకోత అంటే ఇదేనేమో.. కళ్ళముందే ఆడుకుంటూ నవ్వుకో వాల్సిన చిన్నారి, ఇప్పుడు కన్నీటి సంద్రంలో మునిగిపోయింది. కన్నబిడ్డను కాపాడుకోలేక, ఆసుపత్రి బెడ్ మీద ఆ చిన్నారి పడుతున్న వేదన చూడలేక ఆ తల్లిదండ్రులు పడుతున్న వేదన వర్ణనాతీతం." వివరాల్లోకి వెళితే..?మహబూబా బాద్ జిల్లా, కొత్తగూడ మండలం బత్తలపల్లికి చెందిన, సంగి దేవరాజ్, సుజాత దంపతులు బ్రతుకుదెరువు కోసం పల్లెను వదిలి, ఆశలతో హైదరాబాద్ నగరానికి వలస వెళ్లారు. అంతా బాగుంటుందని అనుకున్న తరుణంలో విధి వారిపై విషం చిమ్మింది. నిన్న ఉదయం... పాపకు స్నానం చేయిద్దామని తల్లి కాస్త లోపలికి వెళ్లి వచ్చేలోపే, ఊహించని ప్రమాదం జరిగింది. పొరపాటున వేడినీళ్లు పాపపై పడటంతో, ఒళ్లంతా కాలిన గాయాలతో చిన్నారి విలవిలలాడిపోయింది. కేవలం ఏడాది వయసున్న ఆ పసిపాపకు అసలు నొప్పి అంటే ఏంటో కూడా తెలియదు. ఏడుద్దామంటే కన్నీళ్లు రావడం లేదు. చెప్పుకుందామంటే ఇంకా మాటలు రావడం లేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో ఆ పసిబిడ్డ చావుబతుకుల మధ్య పోరాడుతోంది. కూలి పనులు చేసుకునే ఆ తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. రోజు రోజుకు పెరుగుతున్న ఆసుపత్రి ఖర్చులను భరించే స్తోమత వారికి లేదు." కన్నబిడ్డను కాపాడుకోవాలని, తమ బిడ్డ ప్రాణాలను నిలబెట్టాలని ఆ తల్లిదండ్రులు దాతల కోసం కన్నీళ్లతో వేడుకుంటున్నారు. దయగల హృదయం ఉన్నవారు, ఆ చిన్నారికి సాయం చేసి పునర్జన్మ ప్రసాదించండి. మీ చిన్నపాటి సాయం... ఆ పసిబిడ్డ ప్రాణాలను కాపాడవచ్చు."ఈ సెల్ ఫోన్ నంబర్ కు -- 8555928201 చేయండి.

# అదృశ్యమైన వృద్ధురాలి మృతి



వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 15 (తెలంగాణ పత్రిక): మండల పరిధి చేరిల గ్రామానికి చెందిన సినీంగి వెంకటమ్మ 80 ఆదివారం ఉదయం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విదితమే పోలీస్ దర్యాప్తులో భాగంగా డాగ్స్ కార్డు క్లూస్ టీం ఆధారంగా చేరిలా గ్రామ పరిసరాల ప్రాంతంలో సాలె రంగయ్య అనే వ్యక్తి వ్యవసాయ బావిలో అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు గుర్తించామని తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ సిఐ వెంకటరాజు గౌడ్ ఎస్ఐ రాజు మృత్తి ఏ విధంగా జరిగిందని కోణంలో దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు.

# పెద్దపల్లి నియోజవర్గం ప్రజలకు మణిహారం బైపాస్ రోడ్డు

-తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



పెద్దపల్లి, ప్రతినిధి జూన్ 15 ( తెలంగాణ పత్రిక ) పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అయినటువంటి బైపాస్ రోడ్డు పనులనుసోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు స్థానిక నాయకులతో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గ మణిహారం అయినటువంటి బైపాస్ రోడ్డు పనులు మొదలు పెట్టడం జరిగిందని సహకరిస్తున్న రైతు సోదరులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ 12 కిలో మీటర్ల మేర పనులు మొదలుకావడం జరిగిందని కొంత మేర కెనాల్ ఉడడం వల్ల పనులు జాప్యం కావడం జరుగుతుందని త్వరలోనే పనులు పూర్తిచేసి వీలైనంత తొందరలో బైపాస్ అందుబాటులోకి తేవడం జరుగుతుందని ఇంకా ఏమైనా పనులు పెండింగ్ లో ఉంటే జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశాల మేరకు స్థానిక రెవిన్యూ డివిజన్ అధికారి గంగయ్య ఆర్ డ బి అధికారుల పర్యవేక్షణలో పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, రెవిన్యూ డివిజన్ అధికారి గంగయ్య, సీఐ ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి రూరల్ ఎస్ ఐ శ్వేత ఆర్ డ బి అధికారులు కౌన్సిలర్లు,సర్పంచులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో వృద్ధురాలు మృతి

-అంత్యక్రియలకు హరీశ్ రావు ఆర్థిక సాయం
-గ్రామ సర్పంచి ద్వారా రూ.5వేల అందజేత



నంగునూరు, జూన్ 15(తెలంగాణ పత్రిక): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన రేకులపల్లి ఉత్తరమ్మ (80) అనారోగ్య సమస్యలతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అంత్య క్రియల నిమిత్తం రూ.ఐదు వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు సోమవారం గ్రామ సర్పంచి, సర్పంచుల ఫోరం మండల శాఖ అధ్యక్షుడు రేకులపల్లి సంతోష్ రెడ్డి ద్వారా ఈ డబ్బులను పంపించారు. హరీశ్ రావు ఆదేశాల మేరకు రేకులపల్లి సంతోష్ రెడ్డి సోమవారం రేకులపల్లి ఉత్తరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్య క్రియల నిమిత్తం రూ.ఐదు వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి గుండెల్లి కవిత, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు రంగు రాజు గౌడ్, నాయకులు రేకులపల్లి కోటేశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నర్సింహా రెడ్డి, గుండెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్, కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో కలెక్టర్ కు దళిత మహిళ ఫిర్యాదు
- ఇందిరమ్మ ఇల్లు అర్ధాంతరంగా ఆపేశారని ఆవేదన
- సర్పంచ్ పై దళితసంఘాల ఆగ్రహం



పాపన్నపేట, జూన్ 15:(తెలంగాణ పత్రిక) తమకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేశారని, ఇందుకు కారణమైన గ్రామ సర్పంచ్ మరియు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతూ పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామానికి చెందిన రేవెళ్ళి సంధ్య సోమవారం కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి సమక్షంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. తనకు నివసించేందుకు సొంత ఇల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా, ఇటీవల ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిందని తెలిపారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా గ్రామ పెద్దల సూచన మేరకు ఇంటి నిర్మాణ బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్ ఇంటి నిర్మాణంలో భాగంగా బేస్‌మెంట్ స్థాయి వరకు పనులు పూర్తి చేసిన అనంతరం, అకస్మాత్తుగా మెటీరియల్ సరఫరా నిలిపివేసి పనులను ఆపివేశాడని ఆరోపించారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా, గ్రామ సర్పంచ్ శ్రీధర్ ఆదేశాల మేరకే పనులు నిలిపివేశానని చెప్పినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్‌ను కలిసి కారణం అడగగా, గత సర్పంచ్ ఎన్నికల్లో తమ కుటుంబం తనకు ఓటు వేయలేదనే కారణంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని నిలిపివేసినట్లు స్పష్టంగా తెలిపారని ఆరోపించారు. అంతేకాకుండా, తనను ఆ 30 మంది గెలిపించారని, వారు అనుమతిస్తేనే ఇంటి నిర్మాణం కొనసాగుతుందని, పదేపదే తన ఇంటికి రావద్దని హెచ్చరించినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికే బేస్‌మెంట్ పనులు పూర్తయ్యాయని, ఆ దశకు సంబంధించిన ఒక బిల్లును కాంట్రాక్టర్‌కు చెల్లించినప్పటికీ నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. కావున, తన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేసిన కాంట్రాక్టర్‌తో పాటు, నిలిపివేతకు కారణమైన గ్రామ సర్పంచ్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, తన ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని రేవెళ్ళి సంధ్య ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొత్తూరి శ్రీనివాస్, బద్రి మల్లేశం, మన్నె వెంకటేశం తదితరులు ఉన్నారు.

-దళిత సంఘాల ఆగ్రహం:

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని కాంట్రాక్టర్ మరియు గ్రామ సర్పంచ్ అర్ధాంతరంగా నిలిపివేయడం పట్ల మెదక్ జిల్లా దళిత సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దళిత కుటుంబం పట్ల సర్పంచ్ తీరు సరికాదని, ఇలాంటివి పునరావృతమైతే ఆందోళనలు సైతం చేస్తామని హెచ్చరించారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ






సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 15, తెలంగాణ పత్రిక రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజలందరూ ఈ నెల 20న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (ఇూరా) అధ్యక్షురాలు పి. నీరజ సూచించారు. సోమవారం జిల్లా కోర్టు సముదాయంలో జిల్లాకు చెందిన న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు, న్యాయ శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.అనంతరం పోలీసు అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు.ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి బి. పుష్పలత, పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, జిల్లా అదనపు ఎస్పీ డి. చంద్రయ్య, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల ఇన్‌చార్జ్ ఇూరా కార్యదర్శి పి. లక్ష్మణాచారి, సీనియర్ సివిల్ జడ్జి వేములవాడ అజయ్ కుమార్ జాదవ్, సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, జూనియర్ సివిల్ జడ్జి కుమారి మేఘన, పోలీసు అధికారులు, కోర్టు మానిటరింగ్ పోలీసులు పాల్గొన్నారు.

# చిన్న మొత్తాలతో నమ్మకం.పెద్ద మొత్తాలతో మోసం!

-అధిక లాభాల ఆశ చూపించి లక్షలు దోచేస్తున్న సైబర్ నేరగాళ్లు
-టెలిగ్రామ్ గ్రూపులు, నకిలీ ట్రేడింగ్ వేదికలపై సైబరాబాద్ పోలీసుల హెచ్చరిక




రంగారెడ్డి జిల్లా,సైబరాబాద్ జూన్ 15,(తెలంగాణ పత్రిక) రోజుకు వేల రూపాయల ఆదాయం, కొద్ది రోజుల్లో డబ్బు రెట్టింపు, టాస్కులు పూర్తి చేస్తే భారీ కమిషన్, ట్రేడింగ్‌లో ఖచ్చితమైన లాభాలు వంటి ఆకర్షణీయమైన ప్రకటనలతో సైబర్ నేరగాళ్లు ప్రజలను వలలో వేసుకుని లక్షల రూపాయలు దోచుకుంటున్నారని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలు, టెలిగ్రామ్ గ్రూపులు, నకిలీ ట్రేడింగ్ వేదికలు, ఫేక్ వెబ్‌సైట్లను ఉపయోగించి అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఈ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు.

మోసం చేసే పద్ధతి ఇదే...

ముందుగా సైబర్ నేరగాళ్లు సామాజిక మాధ్యమాలు లేదా టెలిగ్రామ్ ద్వారా బాధితులను సంప్రదిస్తారు. అనంతరం ప్రత్యేక గ్రూపుల్లో చేర్చి, తాము అంతర్జాతీయ సంస్థలు, ప్రముఖ హోటళ్లు, రిసార్టులు లేదా పెద్ద వ్యాపార సంస్థల ప్రతినిధులమని చెప్పి నమ్మకం కల్పిస్తారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ పనులు, ఉత్పత్తుల ప్రచారం, ఆర్డర్ బుకింగ్, ట్రేడింగ్ కార్యకలాపాల పేరుతో మొదట చిన్న మొత్తాలను పెట్టుబడిగా పెట్టిస్తారు. ప్రారంభంలో కొంత లాభం వచ్చినట్లు చూపించి బాధితుల విశ్వాసాన్ని పొందుతారు. అనంతరం భారీ లాభాల ఆశ చూపుతూ మరింత పెద్ద మొత్తాలు పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెడతారు.

ఖాతాలో లాభాలు కనిపిస్తాయి... చేతికి డబ్బు మాత్రం రాదు

నకిలీ వెబ్‌సైట్లలో బాధితుల ఖాతాల్లో భారీ లాభాలు వచ్చినట్లు చూపిస్తారు. అయితే డబ్బు ఉపసంహరించుకునే సమయంలో కొత్త కొత్త నిబంధనలు ముందుకు తెస్తారు. ఖాతా ధృవీకరణ రుసుము, పన్ను క్లియరెన్స్ చార్జీలు, భద్రతా డిపాజిట్, ప్రత్యేక సభ్యత్వ రుసుము, డబ్బు విడుదల ఛార్జీలు, వంటి పేర్లతో మరిన్ని చెల్లింపులు చేయాలని డిమాండ్ చేస్తారు. ఇప్పటికే పెద్ద మొత్తంలో డబ్బు పెట్టుబడి పెట్టిన బాధితులు తమ డబ్బు తిరిగి వస్తుందనే ఆశతో మళ్లీ మళ్లీ డబ్బులు చెల్లిస్తారు. అయినప్పటికీ డబ్బు పొందలేరు. చివరికి నేరగాళ్లు బాధితులను బ్లాక్ చేయడం లేదా సంప్రదింపులు నిలిపివేయడం జరుగుతుంది. ప్రజలకు సైబర్ పోలీసుల సూచనలు

-టెలిగ్రామ్ లేదా సామాజిక మాధ్యమాల్లో వచ్చే అధిక లాభాల హామీలను నమ్మవద్దు.
- ముందుగా డబ్బు చెల్లించాలని కోరే ఉద్యోగ అవకాశాలకు దూరంగా ఉండండి.
- తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే పథకాల పట్ల అప్రమత్తంగా ఉండండి.
- డబ్బు ఉపసంహరణ కోసం అదనపు చెల్లింపులు కోరితే వెంటనే అనుమానించండి.
- ఇప్పటికే పెట్టిన డబ్బు తిరిగి వస్తుందనే ఆశతో మరిన్ని చెల్లింపులు చేయవద్దు.

మోసపోతే వెంటనే ఫిర్యాదు చేయండి

సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే 1930 సైబర్ సహాయ కేంద్రానికి కాల్ చేయాలని, లేదా జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదు వేదికలో ఫిర్యాదు నమోదు చేయాలని సైబరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం సూచించింది..

# తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో యోగా కార్యక్రమాలు

కోటగిరి తెలంగాణ పత్రిక జూన్ 15. 12వ. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాలు నిర్వహించారు. పోతంగల్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రజల్ని ఉద్దేశించి యోగ ప్రాముఖ్యత ప్రాచీన భారతీయ సంస్కృతి ప్రపంచానికి అందించిన గొప్ప వరం యోగా సాధన అని యోగ ఇన్స్ట్రక్టర్ డి సతీష్ గౌడ్ అన్నారు.యోగ మానవాళి శారీరక మానసిక శ్రేయస్సుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకోవడానికి జూన్ 21 పోతంగల్ యోగ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నమని పేర్కొన్నారు . ఈ వేడుకలో ప్రజలు యోగ




అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని ప్రతి ఒక్కరికి తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యోగ ఇన్స్పెక్టర్ డి. సతీష్ గౌడ్, జ్యోతి ఆశ వర్కర్లు శారద, సునీత, రేష్మ, లింగామని, అనిత గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు బస్టాండ్ లో ప్రారంభమైన సీసీ పనులు

-బస్టాండ్ లోనికిరాని బస్సులు, అవస్థలు పడుతున్న ప్రయాణికులు
-బస్టాండ్ లోనికి బస్సులు వెళ్లే వెసులుబాటు ఉన్నా! 365 జాతీయ రహదారి పైనే ఆర్టీసీ బస్సుల నిలిపివేత
-ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయని ఆర్టీసీ ఉన్నతాధికారులు
-బస్టాండ్ లోనికి వెళ్లాలని కంట్రోలర్ చూయించిన నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్న ఆర్టీసీ బస్సుల ( డైవర్లు
-అసహనానికి లోనైనా కంట్రోలర్ నర్సంపేట డిపోకు తిరుగు ప్రయాణం
-మరమ్మత్తు పనుల నేపథ్యంలో నీటి పైపులైను గల్లంతు, నీటి సౌకర్యానికి ఆటంకం
-భానుడి ప్రతాపానికి పల్లడిల్లుతున్న ప్రయాణికులు
-ఈ సమస్యను పరిష్కరించేదెవరు?
-ప్రయాణికులకు ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పించేది ఎవరు?
-ఒకటి రెండు బస్సులు బస్టాండుకు, మిగతావి రోడ్లపైనే ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రయాణికులు

గూడూరు మండల ప్రతినిధి:- జూన్ 15
.(తెలంగాణ పత్రిక):-





మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రంలో ని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో, గత నాలుగు రోజుల క్రితం నుండి సీసీ పనులు ప్రారంభమయ్యాయి. దీనితో మండల ప్రజలకు, ప్రయాణికులకు ఒకింత ఆనందమే అయినా?, మరో పక్కన అంతకుమించి దయనీయ పరిస్థితి నెలకొంది. ప్రయాణికులకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏమీ చేయకుండానే? ఈ అభివృద్ధి పనులు ప్రారంభం అవడంతో నే, ప్రయాణికుల అవస్థలు కూడా ప్రారంభం అయ్యాయి. ఆర్టీసీ అధికారులు నేటి వరకు కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం శోచనీయం. ఒకటి రెండు బస్సులు బస్టాండ్ లోనికి వచ్చినా?, పెద్ద సంఖ్యలో 365 రోడ్లపైనే బస్సులు నిలిపి వేయడంతో!, బస్టాండ్ ప్రాంగణంలోనే ప్రయాణికులు, బస్టాండ్ నుండి రోడ్డు వైపు, రోడ్డు వైపు నుండి బస్టాండుకు పరుగులు పెడుతూ... ప్రయాస పడుతున్న ప్రయాణికులు. ఇవేమీ పట్టనట్లుగానే ఆర్టీసీ బస్సు డ్రైవర్లు?. 365 జాతీయ రహదారిపైనే కొందరు బస్సులను నిలిపి, నిలిపివేయనట్లుగానే నిలుపుతూ... బస్టాండ్ ప్రాంగణం నుండి ప్రయాణికులు బస్సు కోసం పరుగులెడుతున్న పట్టించుకోకుండానే! బస్సును పరుగులు పెట్టిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు. దీనికి తోడు భానుడి భగభగళ ప్రతాభానికి ప్రయాస పడుతున్న ప్రయాణికులు. 365 జాతీయ రహదారిపై నిలిపి వేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లకు, కంట్రోలర్, స్థానిక ప్రజలు బస్టాండ్ లోనికి వెళ్లాలని చూయిస్తున్నా! నిర్లక్ష్య ధోరణితో వ్యవరిస్తున్నారని, గూడూరు మండల ప్రజలు వాపోతున్నారు. ఈ విషయం పై, సరస్వతి నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ కు, చరవాణి తో పలుమార్లు స్థానిక ప్రజలు సమాచారం ఇచ్చిన స్పందించని వైనం. చివరకు గూడూరు బస్టాండ్ లో కంట్రోలర్ గా విధులు నిర్వహించడానికి వచ్చిన నిర్వాహకుడు సైతం? డ్రైవర్ల తీరుతో అసహనానికి లోనై తిరిగి నర్సంపేట డిపోకే ? చేరుకున్న కంట్రోలర్ తీరు మరీ బాధాకరం. ఆర్టీసీ డిపో మేనేజర్ కు, ఆర్టీసీ డ్రైవర్లకు మధ్యన అవగాహన లోపమే దీనికి కారణమా? ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ తీరుకు స్వస్తి పలికి, తక్షణమే ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసి, ప్రయాణికులు తికమకలకు తిలోదకాలు ఇచ్చి, ఆర్టీసీ బస్సుల లో ప్రజలు ప్రయాణం చేసే దిశగా ఏర్పాట్లు చేయాలని, విద్యావేత్తలు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు, గూడూరు మండల ప్రజలు, ప్రయాణికులు. మహబూబాబాద్, నర్సంపేట డిపో మేనేజర్ల ను కోరుతున్నారు.

# భూమి పేరుమార్పు పేరుతో మోసం

-సీపీఐ నేతపై భూకబ్జా ఆరోపణలు
-ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబం

పెద్దపల్లి , ప్రతినిధి జూన్ 15 ( తెలంగాణ పత్రిక )



పెద్దపల్లి పట్టణంలోని ఉదయ్‌నగర్‌కు చెందిన పెర్క శ్రవణ్‌కుమార్ కుటుంబం తమ వ్యవసాయ భూమిని అక్రమంగా కబ్జా చేశారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. బాధితుల కథనం ప్రకారం, పెద్దపల్లి పరిధిలోని రంగంపల్లి శివారులో సర్వే నంబర్లు 66/2, 66/3, 67లలో మొత్తం 1.28 ఎకరాల వ్యవసాయ భూమిని తమ తాత పెర్క హనుమయ్య 1983లో కీర్తి రాములు, కీర్తి మల్లయ్య, జనగామ పోషాల నుంచి కొనుగోలు చేశారని తెలిపారు. అప్పటి నుంచి తామే ఆ భూమిని సాగు చేసుకుంటూ కాస్తులో ఉన్నామని, దీనికి సంబంధించిన అన్ని లింక్ డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అయితే సర్వే నంబర్ 66/2లోని 16 గుంటల భూమి అకారణంగా పెర్క రాములు, పెర్క నర్సయ్య పేర్లపైకి మారిందని తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న సమయంలో తాండ్ర సదానందం అనే వ్యక్తి తమ భూమిని తిరిగి తమ పేరుపైకి తెప్పిస్తానని నమ్మబలికి, తమ తాతతో తెల్లకాగితాలపై సంతకాలు తీసుకున్నాడని ఆరోపించారు. అనంతరం భూమిని తమ పేరుపైకి మార్చకపోగా, అందులో 8 గుంటలను తన పేరు మీదకు, మరో 8 గుంటలను పెర్క నర్సయ్య పేరు మీదకు పట్టా చేయించు కున్నాడని ఆరోపించారు. ఈ విషయమై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతూ, తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని వాపోయారు. అలాగే రెండు గుంటలు, మూడు గుంటలు ఇస్తామని రాజీ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు భాదితులు వాపోయారు. భూకబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న తాండ్ర సదానందంపై తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే సీపీఐ పార్టీ నాయకత్వం ఆయనను సస్పెండ్ చేయడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి పదవులు ఇవ్వవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పెర్క శ్రవణ్‌కుమార్, పెర్క రాజేశం, పెర్క లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ముంపు ప్రాంతం పై దృష్టి సారించిన సర్పంచ్





-డ్రెయిన్ల పై ఆక్రమణలను తొలగించడానికి జేసీబీతో కార్యదర్శి

తెలంగాణ పత్రిక/దమ్మపేట(జూన్ 15)

దమ్మపేట గ్రామ పంచాయతీ పరిధిలో గల గాయత్రీనగర్ ప్రతీ సంవత్సరం ప్రధాన రహదారి వైపు గల ప్రాంతం ముఖ్యంగా దమ్మపేట అర్బన్ కాలనీ జంక్షన్ నుండి పశువుల ఆసుపత్రి వరకు ముంపు గురు అవుతూ రోడ్డుతో సహా మునిగి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో కొత్తగా కొలువుదీరిన పంచాయతీ పాలకవర్గం వర్షాకాలం దృష్ట్యా ముందస్తుగా దృష్టి సారించి ముంపుకు గురు అయ్యే డ్రెయిన్లు, కాలువలను, కల్వర్టులను శుభ్ర పరచాలని సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు ఆదేశించడంతో పాలకవర్గ సభ్యులు శనివారం నుండి 6, 7, 8, 9 వార్డుల్లో పూడికతీత పనులు చేపట్టారు. గాయత్రీ నగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద కల్వర్ట్, అర్బన్ కాలనీ జంక్షన్ వద్ద కల్వర్ట్, రాంజీ కుంటకు వరద నీరు వెళ్ళే విధంగా కాలువలను వెడల్పు చేసి పూడికతీత పనులు చేపట్టారు. కల్వర్ట్ క్రింద ఉన్న తూరలకు డ్రైన్ గోడ అడ్డంగా ఉన్న వాటిని తొలగించారు. కాలువలలో పేరుకుపోయిన తీసిన పూడికలను వెంటనే ట్రాక్టర్లతో తరలించి వేస్తున్నారు. చాలాకాలంగా కాలువలలో పేరుకుపోయిన చెత్తా చెదారాలు, పూడికల వలన మురికి నీరు ప్రవాహానికి అడ్డంకిగా నిలిచేది. దోమల వృద్ధి కూడా అధికంగా ఉండే పరిస్థితితో మురుగు కాల్వల శుభ్రత తో సమస్యలు తీరనున్నాయి అని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. సుమారు రెండు కిలోమీటర్ల పొడవు ఉన్న ప్రధాన రహదారి డ్రైన్లపై వ్యాపారస్తులు షెడ్డులు, వ్యాపార సంబంధిత పనిముట్లు, షాప్ బోర్డులు వచ్చిన కస్టమర్ల వాహనాలతో ప్రధాన రహదారి పై ఉన్న రద్దీతో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టడానికి, గ్రామ సభలో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది అని పలు కంప్లైంట్ రావడంతో, పాలక వర్గం తీర్మానం చేయడం, సాక్షాత్తు అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ గత వారం రోజుల క్రితం జరిగిన పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో మాట్లాడుతూ గ్రామస్తులు అందరూ ఏకాభిప్రాయంతో డ్రైన్ కి ఇంత దూరం అని చెప్పితే 15 రోజుల్లో నోటీస్ ఇచ్చి ఖాళీ చేపిస్తాం అనడంతో పంచాయతీ కార్యదర్శి బండి అనంత్ కుమార్ ప్రతీ షాప్ యజమానికి నోటీస్ ఇచ్చిన మార్పు లేకపోవడంతో సోమవారం జే.సి.బి తో సెయింట్ మేరీస్ స్కూల్ ముందు గల వే బ్రిడ్జి నుండి షాప్ యజమానులకు డ్రైన్లను సాయంత్రం లోపు ఖాళీ చేయాలి అని మరో మారు మేము వచ్చేసరికి మీరు ఖాళీ చేయకపోతే మేము ఖాళీ జే.సి.బి తో చేయిస్తాము అన్నారు. కరెంట్ తీగలు క్రింద గల చెట్లను తొలగించారు. తదనంతరం షాప్ యజమానులు దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశమై మేము సామాన్యులము మేము బతుకు తెరువు కోసం డ్రైన్ లపై షాపులు పెట్టుకొని జీవిస్తున్నాం ఇప్పుడు మీరు ఖాళీ చేయమంటే మా పరిస్థితి ఏంటి అని అడగగా కార్యదర్శి మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలు మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేదని, కానీ పరిస్థితులు ఇప్పుడు అనుకూలంగా లేవని ముఖ్యంగా రోడ్డు భద్రత వలన ఈ పరిస్థితి నెలకొంది అన్నారు. దమ్మపేట గ్రామపంచాయతీకి చెందిన పంచాయతీ స్థలంలో ఇంజనీర్ చే ప్లాన్ ప్రకారం ఇచ్చిన షాపుల్లో అద్దెకు స్థలం ఇస్తాము అన్నారు. పోటీ ఉన్న షాపులకు లాటరీ ద్వారా ఎంపిక చేసి ఇస్తామని దీనికి ముందస్తుగా పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ స్థానంలో షాప్ పెట్టుకొనుటకు దరఖాస్తు పెట్టుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, పంచాయతీ సిబ్బంది పగడాల గోపి, విజయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో మృతిని కుటుంబనికి అరవై వేల రూపాయలు అందజేత



కమలాపూర్ తెలంగాణ పత్రికా న్యూస్ (జూన్ 15)

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని కానిపర్తి గ్రామంలో బుడగజంగాలకు చెందిన పస్తం వినోద్ తండ్రి సారయ్య ఇటీవల గుండెపోటుతో మరణించగా అతని ఇద్దరు పిల్లలు అనాధలుగా మారడంతో పాటు కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడడంతో ఈ విషయం తెలుసుకున్న స్నేహ సేవ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి నరేడ్ల సీతారాం రెడ్డి గ్రామ ప్రజల్లో దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలంటూ పిలుపునివ్వగా కానీపర్తి వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయడంతో సహృదయంతో దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. వారికి నరెడ్ల సీతారాం రెడ్డి ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. దాతల నుండి సమీకరించిన డబ్బులు 60 000 రూపాయలు మృతుడి భార్య భాగ్యలక్ష్మి మరియు కూతురు కు గ్రామ పెద్దల చేతుల మీదుగా అందించారు. అనంతరం కోడిగుడ్డు బాలరాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం కానిపర్తి గ్రామంలో జరగడం మొదటిదని ఇకనుండి పేదవారు ఎవరైనా చనిపోతే ఇలానే దాతలు అందరూ తలో చేయి వేసి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోడిగుటి చేరాలు, ఉప సర్పంచ్ జనగాని చారి బాబు, స్నేహ సేవ ఫౌండేషన్ అధినేత మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీడీవో తొగారి అన్నమయ్య, కోడిగుటి చిన్న బాలరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్, మాటూరి రమణాచారి, బి ఆర్ ఎస్ పార్టీ దబ్బుట కిరణ్, పస్తం ఐలయ్య, సతీష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ



ఇల్లంతకుంట జూన్ 15 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట మండలంలోని గాలిపెల్లి, ఇల్లంతకుంట ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధనా విధానం, విద్యార్థుల అవగాహన స్థాయిని పరిశీలించారు. ఉపాధ్యాయులకు బోధనలో ఆధునిక పద్ధతులు అవలంబించాలని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య అందించడంతో పాటు పరిశుభ్రత పాటించాలని ఉపాధ్యాయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఫీడర్ నిర్వహణ పనుల నేపథ్యంలో విద్యుత్ అంతరాయం

మేడ్చల్, జూన్ 15(తెలంగాణ పత్రిక):-



చెట్ల కొట్టివేత మరియు ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా మంగళవారం (16-06-2026) మేడ్చల్ రూరల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు గౌడవెల్లి సబ్‌స్టేషన్‌కు చెందిన 11 కేవీ ఐడీఏ గౌడవెల్లి ఫీడర్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుంది. ఈ సందర్భంగా ఇండస్ట్రియల్ ఏరియా, సాన్వి సుకృతి విల్లాస్, బృందావన్ బిల్డర్స్ ప్రాంతాలు ప్రభావితమవుతాయి. అలాగే మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు గౌడవెల్లి సబ్‌స్టేషన్‌కు చెందిన 11 కేవీ ఐడీఏ బసర్‌గాడి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. దీంతో జ్ఞానాపూర్ గ్రామం, బసర్‌గాడి ఇండస్ట్రియల్ ఏరియా, బసర్‌గాడి గ్రామం, జ్ఞానాపూర్ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాలు ప్రభావితమవుతాయి. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ (ఆపరేషన్), మేడ్చల్ రూరల్ కోరారు.

## రోహింగ్యా ముస్లింలను గుర్తించి చర్యలు తీసుకోవాలి: కావేరి శ్రీధర్ ముదిరాజ్

మేడ్చల్ జూన్ 15(తెలంగాణ పత్రిక):-



గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో అధికారిక గుర్తింపు పత్రాలు లేకుండా అక్రమంగా నివసిస్తున్న వ్యక్తులపై సమగ్ర విచారణ చేపట్టి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్ పోలీసులను కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని పలు నిర్మాణ సంస్థలు, లేబర్ క్యాంపులు, అద్దె ఇళ్లలో కొందరు అనుమానాస్పద వ్యక్తులు స్థానికుల గుర్తింపుతో సంచరిస్తున్నట్లు ప్రజల ద్వారా సమాచారం అందిందన్నారు. దేశ భద్రత, స్థానిక శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సంబంధిత అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. బయోమెట్రిక్ వివరాలు, ఆధార్ కార్డులు మరియు ఇతర గుర్తింపు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించడం ద్వారా చట్టబద్ధంగా నివసిస్తున్న వారిని, అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నకిలీ పత్రాలతో ఎవరైనా స్థానికంగా స్థిరపడితే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో సమగ్ర గ్రౌండ్ వెరిఫికేషన్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి చింతలపూడి రామారావు తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు. అక్రమ వలసలు లేదా వ్యక్తుల గుర్తింపుకు సంబంధించిన అంశాలు సంబంధిత ప్రభుత్వ, పోలీసు శాఖల విచారణ ద్వారా మాత్రమే నిర్ధారించబడతాయి. చట్టబద్ధమైన ఆధారాల ఆధారంగా అధికారులు తగిన చర్యలు తీసుకుంటారు.

## ఎర్ర చెరువు అభివృద్ధి నూతన రహదారి నిర్మాణానికి డిప్యూటీ కమిషనర్ కు వినతి



మేడ్చల్, జూన్ 15(తెలంగాణ పత్రిక):-

మేడ్చల్ పట్టణ అభివృద్ధి, భూగర్భ జలాల సంరక్షణ లక్ష్యంగా ఎర్ర చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు హౌసింగ్ బోర్డు నుంచి లైబ్రరీ వరకు నూతన రహదారి నిర్మాణం చేపట్టాలని మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ నాయకులు డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సోమవారం డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎర్ర చెరువులో పేరుకుపోయిన పూడికను తొలగించడం ద్వారా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే చెరువులోకి డ్రైనేజీ నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని, ఆధునిక లైటింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. అదే విధంగా హౌసింగ్ బోర్డు నుంచి లైబ్రరీ వరకు ఉన్న మార్గం మేడ్చల్ రైల్వే స్టేషన్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్షణమే నూతన రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా జిల్లా నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమదాసు, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శులు సురేందర్ రెడ్డి, విష్ణు, కార్యవర్గ సభ్యులు శ్రీపాల్, సీనియర్ నాయకులు ధాత్రిక లక్ష్మణ్ వంజరి, పాతూరి సుధాకర్ రెడ్డి, కవి రాజు, బీజేపీ యువ మోర్చా కార్యదర్శి భరత్ వంజరితో పాటు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌలికర్, బొజ్జ వంశీ రెడ్డి, మామిళ్ళ నర్సింగ్ రావు, ఎన్.ఎస్. గౌడ్, బాబు గౌడ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. తుమ్మ చెరువు అభివృద్ధి, రహదారి నిర్మాణం వంటి అంశాలు అమలైతే మేడ్చల్ పట్టణంలో మౌలిక వసతులు మెరుగుపడటంతో పాటు భూగర్భ జలాల పరిరక్షణకు కూడా దోహదపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# క్రీసెంట్ బీఎడ్ కళాశాల గుర్తింపును రద్దు చేయండి

-మైనారిటీ ముసుగులో నిబంధనలు పాటించడంలేదు..

-కలెక్టరుకు ఫిర్యాదు చేసిన బిజెపినేత సదానందం..

పెద్దపల్లి, ప్రతినిధి జూన్15 ( తెలంగాణ పత్రిక )



నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ నిబంధనలకు విరుద్ధంగా పెద్దపల్లి కేంద్రంలో కొనసాగుతున్న క్రీసెంట్ బీఎడ్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం జిల్లా కలెక్టరు కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ, అనుమతిమేరకు పట్టణంలోనే కొనసాగాల్సిన కళాశాలను వేరేచోటికి మార్చినారని, ఇటీవల పలు పత్రికల్లో కళాశాలకు వ్యతిరేకంగా కథనాలు ప్రచురితం కావడంతో తిరిగి పెద్దపల్లిలోని క్రీసెంట్ పాఠశాల ప్రాంగణంలోకి తీసుకువచ్చారని తెలిపారు. ఎన్సిఈటి నిబంధనల ప్రకారం కళాశాలను ఒక ప్రాంగణం నుండి మరో ప్రాంతానికి తరలించడానికి అనుమతిలేదన్నారు. కళాశాలలో ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, సైకాలజీ ల్యాబ్, లాంగ్వేజ్ ల్యాబ్, మెథడాలజీ ల్యాబ్, సరిపడ గ్రంథాలయం, విద్యార్థులకు అవసరమైన విద్యా వాతావరణం లేదన్న ఆయన ప్రతి సెమిస్టర్‌కు కనీసం 100రోజుల తరగతులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో తరగతులు సక్రమంగా జరగడంలేదని వివరించారు. నకిలీ హాజరు రికార్డులు నిర్వహించడం, హాజరు లేకుండానే పరీక్షలకు అనుమతించడం, టీచింగ్ ప్రాక్టీస్ కేవలం కాగితాలకే పరిమితం కావడం, ప్రాక్టికల్స్, డిసర్టేషన్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవడం, మార్కుల నమోదు, విద్యా రికార్డుల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మైనారిటీ ముద్రవేసుకుని ఎన్ని అక్రమాలైన చేయవచ్చని కళాశాల యాజమాన్యం భావిస్తోందని ఆరోపించారు. ఇకనైనా అధికారులు తక్షణమే స్పందించి కళాశాలపై ప్రత్యేక కమిటీతో సమగ్ర విచారణ చేపట్టి, కళాశాల గుర్తింపును రద్దుచేసి యాజమాన్యం, కరస్పాండెంట్, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సదానందం డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థుల నుండి వసూలు చేసిన అక్రమ రుసుములను తిరిగి చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో కోరారు.

# జిల్లాలో అంటూవ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

-కామారెడ్డి జిల్లా కలెక్టర్

కామారెడ్డి ,జూన్ 15,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)





పల్స్ పోలియో కార్యక్రమం -- 28 జూన్ 2026, నేషనల్ డీవార్మింగ్ డే -- 13 జూలై 2026 మరియు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌పై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఌ జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ ఆశిష్ సంగ్వాన్, అధ్యక్షతన కలెక్టరేట్లోని ప్రధాన సమావేశ మందిరంలో పల్స్ పోలియో కార్యక్రమం, నేషనల్ డీవార్మింగ్ డే , స్టాప్ డయేరియా క్యాంపెయిన్ అమలుపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ విక్టర్ , అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీ గిరి , జెడ్పీ సీఈఓ శ్రీ చంద్ర నాయక్ , జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె. వెంకట్ , జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి, ఆర్టీసీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం. రోహిత్ కుమార్ , ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు గౌడ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటస్వామి , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఐఏఎస్ గారు మాట్లాడుతూ, జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో అత్యంత విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు అందేలా వైద్య మరియు ఆరోగ్య శాఖ సమగ్ర ప్రణాళిక రూపొందించిందని, అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు, పంచాయతీరాజ్ శాఖ, మున్సిపల్ శాఖ , ఇతర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హత గల చిన్నారికి రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె. వెంకట్ మాట్లాడుతూ, జిల్లాలో 0--5 సంవత్సరాల వయస్సు గల పిల్లలను లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం జిల్లాలో 733 పల్స్ పోలియో బూత్‌లు, 36 ట్రాన్సిట్ పాయింట్లు, 22 మొబైల్ టీమ్‌లు , 199 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. జూన్ 28న బూత్ స్థాయి కార్యక్రమం, అనంతరం జూన్ 29 మరియు 30 తేదీలలో ఇంటింటి సర్వే (హౌస్ టు హౌస్) కార్యక్రమం నిర్వహించి, బూత్‌లలో మిగిలిపోయిన ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు అందజేయనున్నట్లు తెలిపారు. వలస కార్మికులు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రదేశాలు మరియు ఇతర హైరిస్క్ ప్రాంతాల్లో ట్రాన్సిట్ పాయింట్లు, మొబైల్ టీమ్‌ల ద్వారా ప్రత్యేకంగా సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు పల్స్ పోలియోపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా నేషనల్ డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని జూలై 13, 2026న, అలాగే మాప్-అప్ రౌండ్‌ను జూలై 20, 2026న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు మరియు యుక్తవయస్కులకు అల్బెండాజోల్ మాత్రలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇక స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను జూన్ 16 నుండి జూలై 31, 2026 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఓఆర్ఎస్ కార్నర్లు ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు జింక్ మాత్రలను పంపిణీ చేయడంతో పాటు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, తల్లిపాలు ఇవ్వడం, సురక్షిత తాగునీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలోని ఓవర్ హెడ్ ట్యాంకులకు ప్రతి రెండు రోజులకు ఒకసారి క్లోరినేషన్ నిర్వహించాలని, ఎక్కడైనా డయేరియా కేసులు గుర్తించిన వెంటనే సమీప ఉపకేంద్రంలోని ఏఎన్ఎం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారి లేదా సంబంధిత వైద్య సిబ్బందికి సమాచారం అందించి తక్షణ వైద్య సేవలు పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పల్స్ పోలియో, నేషనల్ డీవార్మింగ్ డే మరియు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతం చేయడానికి అన్ని శాఖలు పూర్తి సహకారం అందించాలని నిర్ణయించారు.

# కామారెడ్డి జిల్లాలో బి ఎల్ ఏ, ఎస్ ఐ ఆర్, మ్యాపింగ్ 90 శాతం పూర్తి

-కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి నిదర్శనం

-కామారెడ్డిడీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్

కామారెడ్డి ,జూన్ 15,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ముఖ్యంగా బి ఎల్ ఎ (బూత్ లెవల్ ఏజెంట్లు) ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాలో బి ఎల్ ఎ, ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ కార్యక్రమం 90 శాతం విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మిగిలిన పనులను కూడా వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలమైన నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకుంటూ ప్రజలకు మరింత చేరువ కావడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, బి ఎల్ ఏలు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయడం వల్లే ఈ స్థాయిలో పురోగతి సాధ్యమైందని అభినందించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. 90 శాతం మ్యాపింగ్ పూర్తి కావడం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల కృషికి నిదర్శనంమిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసి జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేస్తాం అని డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పేర్కొన్నారు.

# మందుబాబులకు జైలు శిక్ష

-కామారెడ్డి ,జూన్ 15,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ ఆరుగురికి కోర్టు జైలు శిక్ష విధించిందని దేవునిపల్లి ఎస్ఐ రంజిత్ తెలిపారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ప్రతిరోజు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు ఇబ్బందుల పడుతున్నారని ఇలాంటి చర్యలకు దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు



# కలెక్టర్ పిలుపుతో రెడ్ క్రాస్ పాటర్న్ మెంబర్‌గా చేరిన జిల్లావాసి కిషోర్ కుమార్

కామారెడ్డి ,జూన్ 15,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

రెడ్ క్రాస్ ప్యాట్రన్ మెంబెర్ గా రూపాయలు 25000 చెల్లించి కామారెడ్డి జిల్లానిజాంసాగర్ మండలములోని బ్రాహ్మణపల్లి , గ్రామానికి చెందిన పట్లోళ్ల కిశోర్ కుమార్ సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వాన్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ ప్యాట్రన్ మెంబర్ గా సభ్యత్వం తీసుకోవడం జరిగింది. కిషోర్ కుమార్ విద్యాపరంగా ధార్మికంగా చేస్తున్న సేవలను కలెక్టర్ కొనియాడడం జరిగింది. ఇలాంటి సామాజిక కార్యక్రమాలను ఇంకా చేయాలని ఇలాంటి సామాజిక కార్యక్రమాలకు రెడ్ క్రాస్ ఒక గొప్ప వేదిక అని వారు తెలియ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లాలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకుంటున్న ఉద్యోగ, ఉపాధ్యాయ బృందాన్ని అందరినీ కూడా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు వారిని ప్రోత్సహించిన పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘ బాధ్యులను అభినందించారు జిల్లా లోని ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా రెడ్ క్రాస్ లో ఈ రోజే సభ్యత్వం తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమములో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీ యన్ వై గిరి , కార్మిక శాఖ సహాయ కమిషనర్ శ్రీ డా. శశికుమార్ , పి ఆర్ టి యుజిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అల్లాపూర్ కుశాల్ , పుట్ట శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



# యూరియా బుకింగ్ యాప్’ ప్రారంభం

-గూడూరు మండల వ్యవసాయ క్షేత్రాధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్

గూడూరు మండల ప్రతినిధి:- జూన్ 15. (తెలంగాణ పత్రిక):-

మహబూబాబాద్ జిల్లా, రైతులకు యూరియాను సులభంగా, పారదర్శకంగా, క్యూలైన్ల ఇబ్బందులు లేకుండా చేసేందుకు అలాగే సమయానికి అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో ఈ నెల 15వ తేదీ నుంచి యూరియా బుకింగ్ యాప్ ప్రారంభమైంది. ఈ యాప్ ద్వారా రైతులు స్వయంగా లేదా రైతు బదులుగా ఎవరైనా యూరియాను బుక్ చేసుకునే సదుపాయం కల్పించబడింది. యూరియా బుకింగ్ సమయంలో పట్టా పాస్ బుక్ లింక్ అయిన మొబైల్ నెంబర్ కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ ఆధారంగా యూరియా బుకింగ్ ప్రక్రియ పూర్తి చేయబడుతుంది. దీనివల్ల అవక తవకలకు తావుండదు. రైతులు తమకు అందు బాటులో ఉన్న సమీప అధీకృత ఎరువుల డీలర్స్ ఎంపిక చేసుకుని యూరియా బుక్ చేసుకునే సౌకర్యం ఈ యాప్ లో ఉంది. బుక్ చేసుకున్న యూరియాను 24 గంటల లోపు తీసుకుని వెళ్లాలి. ఏదైనా కారణంతో తీసుకోకపోతే మళ్ళీ బుక్ చేసుకొని తీసుకోవచ్చు. భూమి విస్తీర్ణం ఆధారంగా రైతులకు యూరియా జారీ చేయబడుతుంది. ఈ యాప్ ద్వారా పట్టా పాస్ బుక్ కలిగిన రైతులు, ఆర్ ఓ ఎఫ్ ఆర్. పాస్ బుక్ కలిగిన రైతులు, పట్టా పాస్ బుక్ లేని రైతులు (సంబంధిత ఏఈఓ ను సంప్రదించడం ద్వారా), అలాగే కౌలు రైతులు యూరియాను బుక్ చేసుకునే అవకాశం కల్పించబడింది. రైతులు మీ యొక్క పంట నమోదు కూడా ఇందులో పొందుపరుచుకొనే అవకాశం ఉందని, ఆ యొక్క సమాచారం తదుపరి పంట కొనుగోలు చేసే సమయాన ఉపయోగపడుతుంది కాబట్టి జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు. భూమి విస్తీర్ణాన్ని అనుసరించి ప్రతి 15 రోజుల వ్యవధిలో విడతల వారీగా యూరియా బుకింగ్ చేసుకునే విధానం అమలులో ఉంటుంది. దీని వలన యూరియా సరఫరాలో అంతరాయం లేకుండా ఉండటంతో పాటు, అక్రమ నిల్వలు అలాగే దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయబడుతుంది. దయచేసి రైతులు సహకరించి ఈ యూరియా బుకింగ్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని, గూడూరు మండల వ్యవసాయ క్షేత్రాధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్ తెలియజేశారు.



# అరసం కవి త్రయానికి ఆత్మీయ ఘన సన్మానం

-కవిత్వం చలనం లేని వారినీ చలింపజేసే శక్తి కలిగి ఉంటుంది: మర్రి గోపికృష్ణ, మహమ్మద్ అంకుష్

కొత్తగూడెం: జూన్ 15 (తెలంగాణ పత్రిక)

కవిత్వం సమాజాన్ని మేల్కొలిపే శక్తివంతమైన ఆయుధమని, చలనం లేని వారిని సైతం చలింపజేయగల గొప్ప శక్తి కవిత్వానికి ఉందని సిపిఐ నాయకులు మర్రి గోపికృష్ణ, మహమ్మద్ అంకుష్ అన్నారు. తెలుగు భాషా వికాసం, తెలుగు సాహిత్య పరిరక్షణ, సంస్కృతి సంప్రదాయాల వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో శ్రీ శ్రీ కళావేదిక, చైతన్య సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాజమహేంద్రవరం గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో జూన్ 6, 7 తేదీలలో నిర్వహించిన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో పాల్గొన్న రామవరం ప్రాంతానికి చెందిన అభ్యుదయ కవులు తూముల శ్రీనివాస్, సయ్యద్ అబ్దుల్ నజీర్, మహమ్మద్ ముస్తఫాలను ఘనంగా సన్మానించారు. రామవరం జానీ మియా టెంట్ హౌస్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని తమ కవిత్వంతో ప్రశంసలు అందుకున్న ఈ ముగ్గురు కవులు కొత్తగూడెం ప్రాంతానికి గర్వకారణమని కొనియాడారు. వీరికి “కవి త్రయం”గా నామకరణం చేశారు. కలం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావచ్చని, తెలంగాణ ఉద్యమ సమయంలో గద్దర్ రాసిన పాటలు ప్రజలను ఉద్యమ దిశగా నడిపించాయని గుర్తుచేశారు. సామాజిక సమస్యలపై కవితల ద్వారా పోరాటం కొనసాగించాలని కవులకు పిలుపునిచ్చారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని కొత్తగూడెం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, సిపిఐ నాయకులు అజ్మీరా బాలాజీ నాయక్, ప్రముఖ అభ్యుదయవాది సీతారాములు, ప్రశాంతి నికేతన్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు సిపిఐ నాయకులు మట్టి కొండయ్యల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి బాలాజీ నాయక్ అధ్యక్షత వహించారు. సన్మాన గ్రహీత, సీనియర్ సిపిఐ నాయకులు, రచయిత, కవి, గాయకులు తూముల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రాంధిక కవిత్వం నుంచి ఆధునిక కవిత్వం వరకు ఎంతోమంది కవులు తమ రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారని అన్నారు. సమాజంలో మార్పు కోసం కవులు తమ కలాలతో పోరాడుతున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 196 దేశాల్లో తెలుగు భాషను పరిరక్షిస్తూ తెలుగు సాహిత్య విలువలను పెంపొందిస్తున్నారని, ప్రపంచ తెలుగు మహాసభలకు అమెరికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, జర్మనీ, జపాన్, దుబాయ్, మలేషియా తదితర దేశాల నుంచి వేలాది మంది సాహిత్యకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. నేటి తరం పిల్లలకు చిన్ననాటి నుంచే తెలుగు భాషపై అభిమానం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కవులు సయ్యద్ అబ్దుల్ నజీర్, మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనడం తమకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. తమను ప్రోత్సహిస్తూ ఏర్పాటు చేసిన సన్మానం బాధ్యతను మరింత పెంచిందని, శ్రామికులు, కార్మికులు, రైతుల సమస్యలు, సామాజిక చైతన్యం కోసం తమ కవిత్వం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ మామిడి శెట్టి సూర్యనారాయణ, రామవరం 2 ఇంక్లైన్ మాజీ సర్పంచ్ గుగులోతు నగేష్, ఉపసర్పంచ్ సింగిరాల రమేష్, సిపిఐ యువజన నాయకులు బరిగల భూపేష్, కూరగాయల శ్రీనివాస్, రాజేష్, ప్రముఖ వ్యాపారవేత్త జాకీర్ హుస్సేన్, ప్రేమ్ కుమార్, సముద్రం, కెసిఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొని కవులను ఘనంగా సత్కరించారు.



# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

-నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు తప్పవు: యూత్ కాంగ్రెస్ నేత సోమిశెట్టి భార్గవ్ సాయి హెచ్చరిక

పాల్వంచ: జూన్ 15 తెలంగాణ పత్రిక

పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తుంటే, కొన్ని విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నాయని పాల్వంచ టౌన్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సోమిశెట్టి భార్గవ్ సాయి ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో పలు డిమాండ్లను ప్రస్తావించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా ఫీజులు వసూలు చేయడం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లోనే అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫామ్‌లు కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేయడం సరికాదన్నారు. అలాగే కొన్ని పాఠశాలల్లో కనీస వసతులు లేకపోవడం, ఆటస్థలాలు లేకపోవడం, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడం, చిన్న గదుల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను కూర్చోబెట్టడం వల్ల విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత మరియు నిర్బంధ విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో బడుగు, బలహీన వర్గాల పిల్లలకు 25 శాతం ఉచిత సీట్లు కల్పించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని పాఠశాలలు ఈ నిబంధనలను అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ విధానాలను మార్చుకోవాలని, లేదంటే విద్యార్థులు, తల్లిదండ్రులను ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని సోమిశెట్టి భార్గవ్ సాయి?




# ఇజ్జత్‌నగర్‌లో రోడ్డు పనుల పేరుతో ప్రజలకు నరకయాతన

-20 రోజులుగా అర్ధాంతరంగా నిలిచిన పనులు నిర్లక్ష్య కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.సిపిఐ నేత టి. రామకృష్ణ

-డ్రైనేజీ పొంగిపొర్లుతూ దుర్వాసన.బురద, దుమ్ముతో కాలనీవాసుల అవస్థలు

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, జూన్ 15, (తెలంగాణ పత్రిక)

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఇజ్జత్‌నగర్ కాలనీలో రోడ్డు నిర్మాణ పనుల పేరుతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న నిర్లక్ష్య కాంట్రాక్టర్‌పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ డిమాండ్ చేశారు. కాలనీలో ఉన్న ప్రధాన రహదారిని నిర్మాణం పేరుతో పూర్తిగా తవ్వి పగలగొట్టి 20 రోజులు గడిచినా ఇప్పటి వరకు కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం అధికార యంత్రాంగం వైఫల్యానికి, కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు, కాంట్రాక్టర్లు ప్రజల ఇబ్బందులను పూర్తిగా విస్మరించి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రోడ్డు పనులను మధ్యలోనే నిలిపివేయడంతో కాలనీలో ఎక్కడ చూసినా దుమ్ము, ధూళి, గుంతలు పేరుకుపోయాయని, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ దెబ్బతినడంతో మురుగునీరు రోడ్డుపైకి పొంగిపొర్లుతూ భరించలేని దుర్వాసన వెదజల్లుతోందన్నారు. దీనివల్ల దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు రావడానికే భయపడే పరిస్థితి ఏర్పడిందని, కనీసం 50 కుటుంబాలు తమ ఇళ్లలోకి సైతం సులభంగా వెళ్లలేని దుస్థితిని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో “అసలు అధికారులు ఉన్నారా? పాలకులు ఉన్నారా?” అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని, బురద, నీటి నిల్వల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. ప్రజల పన్నుల సొమ్ముతో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి కష్టాలు పెంచడం దురదృష్టకరమని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు వెంటనే జోక్యం చేసుకుని రోడ్డు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, పనులను నిర్లక్ష్యంగా వదిలేసిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని టి. రామకృష్ణ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో కాలనీ ప్రజలను సమీకరించి భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, అధికారుల కార్యాలయాల ముట్టడి వరకు ఉద్యమాన్ని విస్తరిస్తామని ఆయన హెచ్చరించారు..



# ఈసీ మెంబర్ కు సన్మానం



కామారెడ్డి ,జూన్ 15,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ కామారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నూతనంగా ఎన్నికైన ముదాం శివ శంకర్ ను సోమవారం బిబిపేట మండల కేంద్రంలో విలేకరులు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతూ విలేకరుల హక్కులపై కృషి చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బిబిపేట విలేకరులు బాబు, రవి, సింహం, రవి, నవీన్, స్వామి పాల్గొన్నారు.

## కామారెడ్డి టీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి శ్రీనివాస్ గౌడ్ కు సన్మానం



**కామారెడ్డి, జూన్ 15,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

తెలంగాణ రక్షణ సేన పార్టీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన గైన శ్రీనివాస్ గౌడ్‌కు నియోజకవర్గ వ్యాప్తంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో, పార్టీ రాష్ట్ర నాయకులు వేముల బలరాం, జిల్లా నాయకులు ఎరుకట్ల కిషన్ సోమవారం కామారెడ్డిలో గైన శ్రీనివాస్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పార్టీ అధినేత్రి కవితమ్మ గారు ఆయనకు కీలకమైన నియోజకవర్గ బాధ్యతలను అప్పగించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు వేముల బలరాం మరియు జిల్లా నాయకులు ఎరుకట్ల కిషన్ మాట్లాడుతూకామారెడ్డి నియోజకవర్గంలో గైన శ్రీనివాస్ గౌడ్‌కు ఉన్న ప్రజాదరణ, రాజకీయ అనుభవం పార్టీ ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో నియోజకవర్గంలోని ప్రతి మండలంలో, గ్రామంలో పార్టీని పటిష్టం చేయడానికి తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అందరినీ కలుపుకొని ముందుకు సాగుతా – గైన శ్రీనివాస్ గౌడ్ తనను సన్మానించిన వేముల బలరాం, ఎరుకట్ల కిషన్ లకు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గైన శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కవితమ్మ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, రాష్ట్ర మరియు జిల్లా స్థాయి నాయకులను, క్షేత్రస్థాయి కార్యకర్తలను కలుపుకుంటూ కామారెడ్డి నియోజకవర్గంలో పార్టీని అగ్రస్థానంలో నిలబెడతానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ సదాశివ నగర్ మండల అధ్యక్షులు చుక్క సాయ గౌడ్, టీఆర్ఎస్ పార్టీ కామారెడ్డి జిల్లా యువజన నాయకులు జొన్నల రాము, వినోద్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నీరుకుళ్ళ నుండి తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరలించొద్దు

**-నీరుకుళ్ళ పెంచికలపేట కేశవాపూర్ ప్రజా ప్రతినిధులుని ప్రజలు డిమాండ్**



**ఆత్మకూరు, జూన్ 15, (తెలంగాణ పత్రిక)**

ఆత్మకూరు మండలంలోని నీరుకుల్ల గ్రామానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తాను విద్యాభ్యాసం చేసిన నీరుకుల్ల హైస్కూల్ను ఇటీవలే నీరుకుల్ల గ్రామానికి మంజూరు చేశారు.కానీ స్థల కొరత విషయంలో దానిని పెద్దాపూర్ గ్రామానికి తరలిస్తున్నారని ప్రచారం జరగడంతో మూడు గ్రామాల ప్రజలు నీరుకుల్ల గ్రామ హైస్కూల్లోనే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని మూడు గ్రామాల కేశవాపూర్, నీరుకుల్ల,పెంచికలపేట గ్రామాల సర్పంచులు వార్డు సభ్యులు గ్రామ ప్రజలు విద్యార్థులు నీరుకుల్ల హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులందరూ కలిసి నీరుకుల్ల గ్రామంలోని రైతు వేదిక వద్ద సమావేశం ఏర్పాటు చేసినారు మూడు గ్రామాల పాలకమండలి ప్రజలు, రైతులు విద్యార్థులు, మేధావులు,మాజీ ప్రజా ప్రతినిధులు, అందరం కలిసి నీరుకుల్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వ పెద్దలపై, అధికారులకు విన్నవించుకుని మా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను మా గ్రామంలో ఏర్పాటు చేసే విధంగా అందరం కలిసికట్టుగా సాధించుకుంటామని తెలిపారు.

## ఎస్.ఐ.ఆర్ విజయవంతానికి బీజేపీ సమాయత్తం





**-ప్రతి బూత్‌లో ఓటర్ ప్రక్షాళనకు నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలి వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి**

**-దొంగ ఓట్ల తొలగింపు, నిజమైన ఓటర్ల నమోదు లక్ష్యంగా ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం రవికుమార్ యాదవ్**

**రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, జూన్ 15, (తెలంగాణ పత్రిక)**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులు పిలుపునిచ్చారు. మసీద్‌బండలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సుమారు 20 సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రతి కాలనీ, ప్రతి బస్తీ, ప్రతి బూత్‌లో జరిగే ఓటర్ ప్రక్షాళన ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ, బూత్ లెవల్ ఆఫీసర్లతో (బీఎల్‌వోలు) పాటు పార్టీ తరఫున నియమితులైన బీఎల్‌ఏ-2లు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించాలని తెలిపారు. నియోజకవర్గంలో లేని వారి పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించడంతో పాటు, అర్హత ఉన్న ప్రతి నిజమైన ఓటరుకు జాబితాలో చోటు కల్పించేలా కృషి చేయాలని సూచించారు. గతంలో దొంగ ఓట్ల తొలగింపు కోసం అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ పూర్తి స్థాయిలో ఫలితం సాధ్యం కాలేదని, ఇప్పుడు ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను పారదర్శకంగా, తప్పులులేని విధంగా రూపొందించుకునే అవకాశం లభించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే పార్టీ నాయకులు, ఆశావహులు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, డివిజన్ నాయకులు, కాలనీ మరియు బస్తీ స్థాయి నాయకులు బీఎల్‌ఏ-2లకు పూర్తి సహకారం అందించాలని కోరారు. యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు కూడా క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి పార్టీ బలోపేతానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు బల్దా అశోక్, అజిత్, హనుమంత్ నాయక్, ప్రభాకర్ యాదవ్, పద్మ, ఎస్.ఐ.ఆర్ కన్వీనర్ మాణిక్ రావు తదితరులతో పాటు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్ స్థాయి నాయకులు, డివిజన్ అధ్యక్షులు, పదాధికారులు, వివిధ మోర్చాల ప్రతినిధులు పాల్గొన్నారు..

## 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు..

-మొదటి పేజీ తరువాయి:
వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురుకాకుండా ముందస్తుగానే అన్ని అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి నివారణ చర్యలు తీసుకోవడం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉంచాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తూ రాబోయే 3 నుంచి 4 రోజుల్లో తెలంగాణ అంతటా విస్తరించే అవకాశం ఉందని, ముఖ్యంగా ఈ నెల 19వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ఊపందుకుని వారం రోజులపాటు కొనసాగవచ్చని వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం మంత్రి గారు రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అప్రమత్తం చేస్తూ అధికారులతో సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 8న దక్షిణ తెలంగాణలోకి ప్రవేశించి జోగులాంబ గద్వాల జిల్లాను ఆవరించగా, ప్రస్తుతం హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా ఉత్తర సరిహద్దు కొనసాగుతోందన్నారు. జూన్ 14 నాటికి దక్షిణ తెలంగాణలోని అన్ని జిల్లాలు, మధ్య తెలంగాణలోని చాలా జిల్లాలను రుతుపవనాలు తాకాయని తెలిపారు. రాష్ట్రంలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, సాధారణ వర్షపాతం 54.9 మిల్లీమీటర్లతో పోలిస్తే సుమారు 10 శాతం లోటు ఉందని పేర్కొన్నారు. వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, విపత్తుల నిర్వహణ శాఖ సిబ్బందితో నిరంతరం సమన్వయం కొనసాగించాలని మంత్రి స్పష్టం చేశారు. వర్షాల తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అన్ని జిల్లాల అధికారులు నిరంతర అప్రమత్తతతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## తెలంగాణకు చల్లని కబురు

-మొదటి పేజీ తరువాయి: నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా చురుగ్గా పురోగమిస్తున్నాయి. ఇవి తాజాగా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. రానున్న 4 నుంచి 5 రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలన్నింటికీ రుతుపవనాలు విస్తరించడానికి పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని పేర్కొంది. ఆదివారం నాటికి రుతుపవనాల ఉత్తర సరిహద్దు (నార్తర్న్ లిమిట్ ఆఫ్ మాన్‌సూన్) మహారాష్ట్రలోని హర్నై, సోలాపూర్ మీదుగా ప్రయాణిస్తూ.. తెలంగాణలోని హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని కళింగపట్నం వరకు విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. అక్కడి నుంచి పారాదీప్, బరిపడ, ధన్‌బాద్ మీదుగా ముజఫర్‌పూర్ వరకు రుతుపవనాల విస్తరణ కొనసాగుతున్నట్లు స్పష్టం చేసింది. రానున్న 4-5 రోజుల్లో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించనున్నాయి. అలాగే ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లోకి కూడా ఇవి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తన తాజా బులెటిన్‌లో వివరించింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాకాలం కానుంది.

## హర్మూజ్ తెరుచుకుంది.. పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గుతాయా?

-మొదటి పేజీ తరువాయి:
ఇరాన్, అమెరికా మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. ఒప్పందంలో భాగంగా హర్మూజ్ జలసంధిని తెరవనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు గణనీయంగా దిగొచ్చాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు తగ్గుతాయా అనే చర్చ మొదలైంది. ముడి చమురు ధరలు తగ్గినంత మాత్రాన దేశంలో వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గవని నిపుణులు చెబుతున్నారు. చమురు మార్కెటింగ్ సంస్థలు గతంలో వచ్చిన నష్టాలను భర్తీ చేసుకునే ప్రక్రియలో ఉన్నాయి. అందువల్ల అంతర్జాతీయ మార్కెట్లో ధరలు కొంతకాలం స్థిరంగా తక్కువ స్థాయిలో కొనసాగితేనే వినియోగదారులకు ప్రయోజనం కనిపించే అవకాశం ఉంది. నిపుణుల అంచనా ప్రకారం ఒకవేళ ధరలు తగ్గించినా లీటర్‌కు రూ.2 నుంచి రూ.4 వరకు మాత్రమే దిగొచ్చే అవకాశముంది. ఎల్‌పీజీ సిలిండర్ ధరల విషయంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కొన్ని వర్గాలకు సబ్సిడీలు అందిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో గ్యాస్, చమురు ధరలు మరింత తగ్గితే ప్రభుత్వంపై సబ్సిడీ భారం తగ్గుతుంది. అప్పుడు ధరల విషయంలో కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉన్నప్పటికీ, అది అందరికీ ఒకేలా వర్తిస్తుందని చెప్పలేం. అయితే హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడం భారత్‌కు మాత్రం సానుకూల పరిణామమే. ఎందుకంటే దేశం అవసరమైన చమురులో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. చమురు ధరలు నియంత్రణలో ఉంటే దిగుమతి వ్యయం తగ్గడంతో పాటు ద్రవ్యోల్బణంపై కూడా ఒత్తిడి తగ్గుతుంది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థకు ఊరట లభించే అవకాశం ఉంది.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143